ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

శుక్రవారం 19 జూలై 2024 | 5



నీట మునిగిన నగరం : రాజమహేంద్రవరం హైటెక్ బస్టాండ్ వద్ద ఇలా

ముసురేసింది!



రోడ్డా.. చెరువా : దేవరపల్లిలో జాతీయ రహదారిపై నిలిచిన నీళ్లు



నీట మునిగిన ఊరు : నల్లజర్ల మండలం చీపురుగూడెంలో రోడ్లపై ప్రవహిస్తున్న వరద నీరు

32 గంటల పాటు వాన

రాజమహేంద్రవరం,జూలై 18 (ఆంధ్రజ్యోతి)/రాజమహేంద్రవరం సిటీ : రోజంతా వాన.. తెరిపివ్వలేదు.. బుధవారం సాయంత్రం నుంచి చిను కులు పడుతూనే ఉన్నాయి. డ్రెయినేజీలు పొంగిపొర్లాయి..ఊళ్లకు ఊళ్లు మునిగిపోయాయి.. చేలు చెరువులుగా మారిపోయాయి.. జనజీవనం అస్తవ్యస్తమైంది. రాజమహేంద్రవరం రోడ్లన్నీ వాననీటితో నిండిపోయాయి.. గోదావరి ఉప్పొంగి ప్రవహిస్తుంది. బంగాళా ఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో గురువారం జిల్లా అంతటా ఒకటే వాన.. మరో మూడు నాలుగు రోజుల పాటు భారీ నుంచి అతిభారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జనం భయపడుతున్నారు. ఒక్కరోజు వర్షానికే జిల్లా అంతటా నీట మునిగింది. రాజమహేంద్రవరం, కొవ్వూరు, నిడదవోలు పట్టణాల్లో పల్లపు ప్రాంతాలు నీట మునిగాయి. రాజమహేం ద్రవరం హైటెక్ బస్టాండ్, ఐఎల్‌టీడీ జంక్షన్, వీఎల్ పురం, దేవిచౌక్, కోరుకొండ రోడ్డు, రామచంద్రరావుపేట, కృష్ణనగర్, తుమ్మలోవ, తాడితోట, ఇన్నీసుపేట, రైల్వే స్టేషన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో డ్రెయినేజీలు పొంగాయి. రోడ్లు కాలువలను తలపించాయి. వాహనదారులు, బాటసారులు ఇబ్బం దులు పడ్డారు. రూరల్ ,కడియం ప్రాంతాల్లో పంటపొలాలు వర్షపు నీటితో నిండాయి. నర్సరీలు నీట మునిగాయి. దేవరపల్లిలో మూడు రోడ్ల సెంటర్, యాదవోలు వాగు వద్ద దళితపేటలో కాల్వలు పొంగి ఇళ్లలోకి, షాపుల్లోకి, స్టేట్‌బ్యాంకులోకి, డిగ్రీ కాలేజీలో భారీగా వరదనీరు చేరింది. జాతీయ రహదారి నీట మునిగింది. గోపాలపురంలో ఓ ఇల్లు కూలిపోయింది. నిడదవోలు ఆర్టీసీ డిపో ఎప్పటిలాగే నీట మునిగింది. మంత్రి కందుల దుర్గేష్ స్వయంగా పరిశీలించి ఇంజన్లతో నీటిని తోడి ప్రయాణి కులకు ఇబ్బందిలేకుండా చూడాలని ఆదేశించారు. నల్లజర్ల మండలం చీపురుగూడెం గ్రామంలో వరద నీరు వెళ్లేందుకు మార్గం లేక గ్రామంపై పడి పొంగి ప్రవహిస్తుంది. పుంతలో ముసలమ్మ గుడి వద్ద తూరలు పెట్టేందుకు గతంలో ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రయత్నించగా వైసీపీ వర్గీయులు అడ్డుకున్నారు.దీనితో వరద నీరు సీసీ రోడ్డుపై పొంగి ప్రవాహిస్తు ఎస్సీ కాలనీపై పడుతుంది. జిల్లాలో 2615 హెక్టా ర్లలో వరి పొలాలు మునిగిపోయాయి. ఉద్యాన పంటలు ముంపునకు గురయ్యాయి.చాలా చోట్ల విద్యుత్ అంతరాయం ఏర్పడింది. జిల్లా వ్యాప్తంగా 130 కిలో మీటర్ల మేర ఆర్అం డ్‌బీ రోడ్లు ధ్వంసం అయ్యాయి. వానకు మరింత అధ్వా నంగా తయారయ్యాయి.

కలెక్టర్‌తో మాట్లాడిన ఎంపీ పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 18 : అధిక వర్షాల నేపథ్యంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని .. అధికారులు తగిన చర్యలు చేపట్టాలని రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి సూచించారు. కలెక్టర్‌తో మాట్లాడి వర్షాల కారణంగా తలెత్తే సమస్యలు, ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అధిక వర్షాల కారణంగా రాజమండ్రి పార్లమెంట్ నియోజకవర్గంలో ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే సెల్ 87903 78374, 94923 85664ను సంప్రదించాలని పేర్కొన్నారు.



వానమ్మా..వదలమ్మా : కడియంలో నీట మునిగిన నర్సరీ



ఆటో..ఎటో : రాజమహేంద్రవరంలో నీట మునిగిన ఆటో

కురిసింది వాన..

జిల్లాలో గడచిన 32 గంటల్లో 1274.4 మి.మీ వర్షపాతం నమోదైందని వాతావరణ శాఖ తెలిపింది.దేవరపల్లిలో అత్యధికంగా 124.8 మి.మీ..అత్యల్పంగా గోకవరంలో 21.2 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లాలో ఇతర మండలాలకు సంబంధించి కడియంలో 79.6 మి.మీ, గోపాలపురంలో 77.2 మి.మీ, అనపర్తిలో 56.8 మి.మీ, రాజమహేంద్రవరంలో 84.2 మి.మీ, రూరల్ 79.4 మి.మీ, రాజానగరంలో 24.4 మి.మీ, కోరుకొండలో 59.0 మి.మీ, రంగంపేట 25.4 మి.మీ, సీతానగరంలో 24.2 మి.మీ, కొవ్వూరులో 65.4 మి.మీ, చాగల్లులో 92.4 మి.మీ, నల్లజర్లలో 69.2 మి.మీ, నిడదవోలులో 117.6 మి.మీ, తాళ్ళపూడిలో 78.2 మి.మీ, ఉండ్రాజవరంలో 73.4 మి.మీ,పెరవలిలో 65.6 మి.మీ వర్షపాతం నమోదైంది. బుధవారం రాత్రి 8.30 గంటల నుంచి గురువారం 4 గంటల వరకూ మొత్తం 1274.4 మి.మీ వర్షపాతం నమో దైంది.సరాసరి వర్షపాతం 67.1 మి.మీ ఉంది.మరొక 48 గం టలు వానలు పడతాయని వాతావరణ శాఖ స్పష్టం చేసింది.

- భారీ వానతో ఊళ్లు..నీళ్లు
- దేవరపల్లిలో అత్యధిక వర్షపాతం
- ఎస్‌బీఐలోకి చొచ్చుకెళ్లిన నీళ్లు
- నీట మునిగిన రాజమహేంద్రవరం
- చీపురుగూడెంలో వీధుల్లో వరద
- 2615 హెక్టార్లలో పొలాలు మునక
- అధ్వానంగా 130 కి.మీ రోడ్లు
- మరో 48 గంటల పాటు ఇంతే
- జిల్లాలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- గోదావరికి పెరుగుతున్న వరద



గూడు..గోడు : గోపాలపురంలో నేలకూలిన ఇల్లు

ఉప్పొంగుతున్న గోదావరి

సముద్రంలోకి 2.23 లక్షల క్యూసెక్కులు

ధవళేశ్వరం, జూలై 18: గోదావరికి వరద నీరు వచ్చిపడుతుంది. అంతకంతకూ నీటిమట్టం పెరుగుతోంది. ఉపనది ఇంద్రావతి నుంచి వరద నీరు పేరూరి వద్ద కలుస్తుండడంతో గోదావరి నీటిమట్టంలో పెరుగుదల నమోదవుతుంది.ఎగువన గోదావరి పెరుగుతూ ఉండడంతో వచ్చి చేరే వరదనీటిని ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ వద్ద అంచనా వేస్తున్నారు. ఈ మేరకు బ్యారేజ్ 175 గేట్లను అరమీటరు మేర పైకి ఎత్తి 2,23,961 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.దీంతో ధవళేశ్వరం వద్ద నీటిమట్టం 8.20 అడుగులుగా నమోదైంది. ఎగువన భద్రాచలం వద్ద బుధవారం రాత్రికి 20.10 అడుగుల వరకు పెరిగిన నీటిమట్టం ఆపై తగ్గుతూ గురువారం సాయంత్రానికి 18.20 అడుగులకు చేరింది. ఎగువ నుంచి వరద వస్తుండటంతో భద్రాచలం వద్ద మళ్లీ పెరుగుదల కనిపిస్తుంది.

విద్యుత్ సమస్య వస్తే.. డయల్

ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ టీవీఎస్ఎన్ మూర్తి

రాజమహేంద్రవరం సిటీ, జూలై 18: వర్షాల కారణంగా జిల్లాలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా సిబ్బందిని అందుబాటులో ఉంచామని ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ టీవీఎస్ఎన్.మూర్తి తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 24/7 సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డివిజన్,జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయి కంట్రోల్ రూమ్ రాజమహేంద్రవరం పర్యవేక్షక ఇంజనీరు కార్యాలయంలో ఏర్పాటు చేశామ న్నారు. రాజమహేంద్రవరంలో జిల్లా స్థాయి కంట్రోల్ రూమ్ నెం 0883-2463354,7382299960, ఏలూరు నెంబరు 9440902926, నిడదవోలు 08813 3221093, 94408 12706, డివిజన్ స్థాయి రాజమహేంద్రవరం టౌన్ 94408 12585, రాజమహేంద్రవరం రూరల్ 7382585487 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

మూడు నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు.. గోదావరి వరదల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. గ్రామ, మండల, డివిజన్ స్థాయి అధికారులతో గురువారం వీడియో, జూమ్ కాన్ఫరెన్స్‌లు నిర్వహించారు.వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఉద్యోగులంతా ముందస్తు కార్యాచరణతో సిద్ధంగా ఉండాలన్నారు. గోదావరి పరీవాహక ప్రాంతాల్లో ఏటిగట్లను పరిశీలించి రక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బలహీనంగా ఉన్న పాత కాజ్‌వేలు, పాత వంతెనలు గుర్తించి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడైనా పాత భవనాల్లో పాఠశాలు నడుస్తుంటే విద్యార్థులను వేరే భవనాల్లోకి మార్చాలన్నారు.సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు.



బడికెలాపోవాలే!

నిడదవోలు, జూలై 18 : బుధవారం రాత్రి నుంచి జోరున వాన కురుస్తున్నా విద్యాశాఖ గురువారం పాఠశాలలకు సెల వు ప్రకటించలేదు.. దీంతో తల్లిదండ్రులు తమ పిల్లలను బడికి పంపేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోజంతా వాన పడడంతో పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు నీట మునిగాయి. సాయంత్రం బడి నుంచి వచ్చే చిన్నారులను ఇంటికి తెచ్చుకునేందుకు అష్టకష్టాలు పడ్డారు. నిడదవోలులో గురువారం తన ఇద్దరు చిన్నారులు వర్షానికి తడవకుండా ఓ తండ్రి భుజాన ఎత్తుకుని టార్పాలిన్ కప్పి ఇంటికి తీసుకు వెళుతున్న ఫొటో ఆంధ్రజ్యోతి ఇలా క్లిక్‌మనిపించింది. మరో 48 గంటల పాటు వానలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో పాఠశాలలకు సెలవు ప్రకటించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.



నిండా ముంచేను : ఉండ్రాజవరంలో నీట మునిగిన వరిచేలు

మోకాళ్ల లోతు నీటిలోనే మంత్రి దుర్గేష్ పర్యటన

నిడదవోలు, జూలై 18 : భారీ వర్షాలకు పట్టణమంతా జలమయమైంది. ఆర్టీసి డిపో సైతం నీట మునిగి చెరువును తలపించేలా మారిపోయింది. డిపో చుట్టూ నిడదవోలు ఊరు పెరిగిపోవడం.. రోడ్లు ఎత్తు పెరగడంతో డిపో లోత ట్టుగా ఉంటుంది.దీంతో చిన్నపాటి వర్షానికే డిపోలో నీరు నిలిచిపోతోంది. అయినా గత పాలకులు ఏనాడూ అటు వైపు కన్నెత్తి చూడ లేదు..సమస్యను పరిష్కరిద్దామని ఆలోచనా చేయ లేదు. అయితే ప్రస్తుత ప్రజా ప్రతినిధి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫి మంత్రి కందుల దుర్గేష్ భారీ వర్షాలకు జలమయమైన ఆర్టీసి డిపోను మోకాళ్ళ లోతు నీటిలో వెళ్లి పరిశీలించారు. భవిష్యత్తులో మరోసారి ఇలాంటి సంఘటన పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులు ఆదేశించారు.



దేవరపల్లిలో ఎస్‌బీఐ బ్యాంక్‌లోకి వెళుతున్న నీరు

రేపే అర్బన్ బ్యాంక్ పోలింగ్

- చల్లా ప్యానల్‌కు కూటమి నేతల మద్దతు
- జగన్ ఫొటో లేకుండా వైసీపీ నేతల ప్రచారం

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ప్రతిష్ఠాత్మకమైన ఆర్యాపురం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఎన్నికల పోలింగ్ శనివారం జరగనుంది.ఈ మేరకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో అర్బన్ బ్యాంక్ ఎన్నికలు నిర్వహించలేదు. నామినేటెడ్ తరహాలోనే చైర్మన్‌ను నియమించారు.అయితే ప్రభుత్వం మారడంతో అర్బన్ బ్యాంక్ ఎన్నికలకు నోటిఫికేషన్ ఇచ్చారు. శనివారం పోలింగ్ తేదీగా నిర్ణయించారు. అటు కూటమి..ఇటు వైసీపీ అనుకూల అభ్యర్థులు బరిలో దిగడంతో పోటీ అనివార్యమైంది. 21న ఓట్ల లెక్కింపు ఉంటుంది. మొత్తం 12 మంది డైరెక్టర్లతో పాలకవర్గం ఉంటుంది.ఇప్పటికే కూటమికి చెందిన ఓ డైరెక్టర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మిగతా 11 డైరెక్టర్ పదవులకు 20న పోలింగ్ జరగనుంది. కూటమి చైర్మన్ అభ్యర్థిగా మాజీ చైర్మన్ చల్లాశంకరరావు పోటీలో ఉన్నారు. ఆయన ప్యానల్ సభ్యులు కూటమి నేతల ఫొటోలతో విస్తృత ప్రచా రం చేస్తున్నారు. వైసీపీ వర్గం ఎక్కడా వైసీపీ ఆనవాళ్లు లేకుండా జాగ్రత్త పడుతోంది.నగర ప్రముఖులు బలపరచిన ప్యానల్ అంటూ వైసీపీ నగర మాజీ అధ్యక్షుడు నందెపు శ్రీనివాస్‌ను చైర్మన్ అభ్యర్థిగా బరిలో దింపి ప్రచారం చేస్తున్నారు. వైసీపీ నేతలు మాత్రం జగన్ బొమ్మ కూడా కనిపించనీయడం లేదు.వైసీపీ అంటే ఓడిస్తారనే భయం కాబోలు.వైసీపీ పేరుకానీ, జగన్ ప్రస్తావన కానీ తేకుండా ప్రచారం చేస్తున్నారు.రాజమహేంద్రవరం కేంద్రంగా వివిధ జిల్లాల్లో 16 బ్రాంచిలతో రూ.1000 కోట్లకు పైగా టర్నోవర్‌తో ఉన్న అర్బన్ బ్యాంక్ పీఠాన్ని కైవశం చేసుకునేందుకు ఎవరికి వారు పోటీపడుతున్నారు.

54 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు : కలెక్టర్

ఆర్యాపురం అర్బన్ బ్యాంక్ పోలింగ్ 20న జరుగుతుందని, 21న ఓట్లను లెక్కిస్తామని జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం ఆమె సమీక్షించారు.ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి వీలుగా ఏర్పాట్లు చేశామన్నారు. రాజమహేంద్రవరంలో 48, ఇతర ప్రాంతాల్లో మరో 6 మొత్తం 54 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుం దన్నారు. బందోబస్తుకు 120 మంది సిబ్బందిని ఏర్పాటు చేశామని డీఎస్పీ కె.విజయపాల్ తెలిపారు.జిల్లా కో ఆపరేటివ్ అధికారి ఆర్.శ్రీరాములు నాయుడు మాట్లాడుతూ బ్యాంక్‌కు 16 బ్రాంచిలను మూడు నియోజకవర్గాలుగా విభజించామన్నారు.74,585 మంది ఓటు హక్కు వినియోగించుకుంటారన్నారు.

దయచేసి వినండి.. గొడుగు తెచ్చుకోండి!

రాజమండ్రి రైల్వే స్టేషన్‌కు వస్తే వానలో తడవాల్సిందే..



రాజమహేంద్రవరం, జూలై 18(ఆంధ్రజ్యోతి): రాజమండ్రి రైల్వే స్టేషనులో పరిస్థితులు ఇటీవల రోజురోజుకు దిగజారుతున్నాయి. ఎన్ఎస్‌జీ-2 హోదా..రోజుకు సరాసరి 30,336 మంది ప్రయాణికులు రాకపోకలు.. 120కిపైగా రైళ్లు.. నాలుగు జిల్లాల రైలు ప్రయాణికులకు గేట్‌వే కలిగిన రాజ మహేంద్రవరం రైల్వే స్టేషన్‌లో సమస్యలు పెరుగుతున్నాయి. 'దయచేసి వినండి.. రైల్వే స్టేషనుకు వస్తే గొడుగు తెచ్చుకోండి' అనేలా పరిస్థితులు ఉన్నాయి. ఎందుకంటే రైల్వే స్టేషనులో ప్లాట్‌ఫాంపైకి వెళ్లిన ప్రయాణికులు తడవకుండా రైలెక్కాలంటే కచ్చితంగా అదృష్టం ఉండాల్సిందే.. రైల్వే స్టేషనులో మొత్తం ఐదు ప్లాట్‌ఫాంలు ఉన్నాయి. 1,2,3 ప్లాట్‌ఫాంలపై నిడివికి తగినట్టు పైకప్పు లేదు. వర్షం కురుస్తున్న సమయంలో రైలు వస్తే జనరల్ బోగీల్లో ఎక్కే ప్రయాణికులు తడుస్తూనే రైలులోకి ప్రవేశించాల్సి ఉంటుంది. ఏసీ, స్లీపర్ బోగీల్లో ఎక్కేవాళ్లు ఎంతో కొంత తడవకుండా ఎక్కడం కష్టమే. మొదటి ప్లాట్‌ఫాం ట్రాక్‌పై మరమ్మతుల నిమిత్తం రాకపోకలను ఆపేశారు. ప్రస్తుతం రెండు, మూడు ప్లాట్‌ఫాంలు ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. మొదటి ప్లాట్‌ఫాం నుంచి మిగతా వాటికి వెళ్లడానికి ఎడమ, కుడివైపు మెట్లున్నాయి.కానీ వానలో తడవకుండా ఆ మెట్లు ఎక్కి వెళ్లడం సాధ్యం కాదు. బయట నుంచి నేరుగా వెళ్లేందుకు నడుపాయం ఉన్నా మెట్లపై చినుకులు, ఫుట్‌పాత్‌పై వర్షం నీరు దాటుకుని వెళ్లాల్సిందే. వెయిటింగ్ హాళ్లలోకి వెళ్లాలన్నా.. చివరికి రైల్వే స్టేషనులోకి ప్రవేశించే సమయంలో కూడా వర్షపు నీళ్ల చుక్కలు నెత్తిపై వేసుకోవాల్సిందే. ప్లాట్‌ఫాంలపై వేసిన రేకుల షెడ్ల స్తంభాల చుట్టూ ప్రయాణికులు కూర్చోడానికి సపటాలు కట్టారు.కానీ వాటిపై కూర్చుంటే తల స్నానం చేసినట్లే. సిమెంటుతో నిర్మించిన కుర్చీల్లో అటూ ఇటూ ప్రయాణికులు కూర్చోగా మధ్యలో వర్షం నీరు పడుతోంది. రెండు, మూడు ప్లాట్‌ఫాంలపై ఎస్కలేటర్ పక్కన ఎందుకనో షెడ్లు వేయకుండా వదిలేశారు. అక్కడ వర్షంలో తడవక తప్పదు. దీంతో ప్రయాణికులు ఒకేచోట పోగుబడుతున్నారు. రేకుల షెడ్లకు ఎక్కడపడితే అక్కడ చిల్లులు పడడం, ఆ షెడ్లు గోడకు కలిసే చోట నీటి ప్రవాహానికి సరైన ఏర్పాటు లేకపోవడం, ఆ షెడ్లపైన నీళ్లు కిందికి డ్రైన్లలోకి వెళ్లడానికి స్తంభాలకు అమర్చిన గొట్టాలు పగిలిపో వడంతో ప్లాట్‌ఫాంలు చిత్తడి చిత్తడిగా మారుతున్నాయి. రైలు ఎక్కే చోట యాంటీ స్కిడ్ టైల్సు వేసినా మిగతా ప్రదేశమంతా నున్నటి టైల్సు ఉన్నాయి. దీంతో రైలు వచ్చినపుడు, వెళ్లే సమయంలో హడావుడిలో వర్షపు నీటి వల్ల ప్రయాణికులు జారి పడే ప్రమాదం ఉంది. కొత్తగా నిర్మించిన 4, 5 ప్లాట్‌ఫాంలపై అయితే అసలు ఎక్కడా ఒక్క రేకుతో కూడా అచ్ఛాదన లేదు. రైల్వే స్టేషను ప్రాంగణంలోకి ప్రవేశించే రోడ్డు గోతులు పడడంతో నీళ్లు నిలిచిపోతున్నాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఏడాదికి సుమారు రూ.140 కోట్ల ఆదాయం ఉన్న రైల్వే స్టేషను ఇలా తిప్పలు పడుతుండడంపై నివ్వెరపోతున్నారు.



రాజమండ్రి రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల ఇక్కట్లు



ఫ్లాట్‌పాంపై నిలిచిన వాన నీరు

ఏ పోలీస్ స్టేషన్‌లో అయినా ఫిర్యాదు చేయవచ్చు

జీరో ఎఫ్ఐఆర్ వేయాల్సిందే: ఎస్పీ నరసింహ కిషోర్



రాజమహేంద్రవరం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కొత్త చట్టాల ప్రకారం స్టేషను పరిధితో సంబంధం లేకుండా జిల్లాలోని ఏ ప్రాంతంలోని పోలీసు స్టేషన్‌లో అయినా బాధితులు ఫిర్యాదు చేయవచ్చని ఎస్పీ డి.నరసింహ కిషోర్ స్పష్టం చేశారు.జీరో ఎఫ్ఐఆర్‌తో పాటు పలు అంశాల గురించి వివరించారు. ఘటనా ప్రదేశం తమ పరిధిలోకి రాదంటూ పోలీసులు తిరస్కరించడానికి వీల్లేదన్నారు. ఫిర్యాదు స్వీక రించి విచారణ జరిపి సంఘటనా స్థలం పరిధి పోలీస్ స్టేషనుకు సదరు ఫిర్యాదును బదిలీ చేయాలని తెలిపారు. కోర్టు అనుమతి లేకపోయినా పోలీసులు నేరుగా అరెస్టు చేసే వాటిని కాగ్నిజబుల్ కేసులు అం టారన్నారు. తమ దృష్టికి వచ్చిన వెంటనే పరిధి, ఫిర్యాదుదారు ఎవరనే దాంతో సంబంధం లేకుండా కేసు నమోదు చేయాలన్నారు. బాధితులు, కుటుంబ సభ్యులు లేదా నేరం గురించి తెలిసిన ఎవరైనా సరే ఫిర్యాదు చేయవచ్చన్నారు. గ్రామ సచివాలయాల్లో కూడా మహిళలు ఫిర్యాదు చేసే వెసులుబాటు ఉంద న్నారు. మహిళల భద్రత, రక్షణ, రూల్ ఆఫ్ లా, పోలీసు సమస్యలు, శాంతి భద్రతలు, మహిళా శిశు సంక్షేమ సేవలపై మహిళా పోలీసులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. పోలీసు సహాయం అవసరమైన వారు డయల్ 112 టోల్‌ఫ్రీ నెంబరుకు గానీ పోలీస్ స్టేషనుకు గానీ ఫోన్ చేయాలని సూచించారు.

స్టాక్ పాయింట్ల నుంచి ఇసుక రవాణా నేరం

జిల్లా మైన్స్ అండ్ భూగర్భ అధికారి సుబ్రహ్మణ్యం

రాజమహేంద్రవరం సిటీ, జూలై 18 : జిల్లాలోని ఇసుక నిల్వలు ఉన్న ఏడు పాయింట్ల నుంచి ఇసుక లోడింగ్, రవాణా వంటివి చేయడం చట్టరీత్యా నేరమని జిల్లామైన్స్ అండ్ భూగర్భ అధికారి ఎం.సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో లారీ ఓనర్స్ అండ్ డ్రైవర్లకు విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఎవరైనా స్టాక్ పాయింట్ల నుంచి ఇసుకను లోడింగ్ చేయించుకుని రవాణా చేసిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. స్టాక్ పాయింట్ల నుంచి రవాణాకు అనుమతులు ఇచ్చే వరకు లారీ డ్రైవర్లు వెళ్లరాదని తెలిపారు.



పి.గన్నవరం మండలం గంటిపెదపూడి బూరుగులంక వద్ద కొట్టుకుపోయిన తాత్కాలిక రహదారి

రోడ్డుపైకి చేపలు..



అంతర్వేది, జూలై 18: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం అంతర్వేది ఆలయ రహదారుల్లో వర్షపు నీటికి చేపలు బయటకు వచ్చేశాయి. ప్రముఖ పుణ్యక్షేత్రం కావడంతో స్వామివారి సన్నిధికి దర్శనానికి వచ్చిన భక్తులు చేపలను చూసేందుకు ఉత్సాహపడ్డారు. స్థానిక యువకులు వలలతో రోడ్డుపై పొంగి పొర్లుతున్న నీటిలో ఎదురీదుతున్న చేపలను పట్టుకున్నారు. తాడేపల్లి గూడానికు చెందిన కొంతమంది భక్తులు దర్శనం అనంతరం సుమారు 50 కిలోల జల్లలు, గొరకలను పట్టుకున్నారు. ఈ చేపల ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియా వేదికగా హల్‌చల్ చేస్తున్నాయి.



చేపలు పడుతున్న స్థానికులు



వాగులో చిక్కుకున్న ఉపాధి కూలీలు

కూనవరంలో కుండపోత

కూనవరం, జూలై 18: కూనవరం మండలంలో కుండపోత వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏకధాటిగా వర్షం కురవడంతో వాగులు, చెరువులు జలమయమయ్యాయి. మండలంలో 8.5 సెం.మీ వర్షపాతం నమోదు అయ్యింది. మండలంలోని టేకులబోరు గ్రామానికి చెందిన ఉపాధి కూలీలు పనులు ముగించుకొని తిరిగి వస్తుండగా బోదునూరు అడవుల్లో ఒక్కసారిగా వాగులు పొంగడంతో చిక్కుకున్నారు. ప్రాణభయంతో ఒకరి చేయి ఒకరు పట్టుకొని బయటపడ్డారు.

జోరు వాన

ప్రవహిస్తున్న వాగులు,వంకలు.. తెగిపోయిన రోడ్లు..జనజీవనం అస్తవ్యస్తం

వాగుల ఉధృతి

వరరామచంద్రాపురం, జూలై 18: గురువారం ఉదయం నుంచి ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షానికి మండలంలోని వాగులు, వంకలు నిండి పొంగి పొర్లుతున్నాయి. చెరువులు నిండి లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అవుతున్నాయి. మండల కేంద్రానికి మూడు కిలోమీటర్ల దూరంలో ప్రధాన రహదారిలో ఉన్న అన్నవరం వాగు చప్టా పైనుంచి వర్షపు నీరు ప్రవహిస్తోంది. దీంతో మండల కేంద్రానికి రావడానికి రాకపోకలు నిలిచిపోయాయి. ఉదయం పది గంటల నుంచి సాయంత్రం వరకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి వరద కూడా క్రమేపీ పెరుగుతోంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరారు.



వరరామచంద్రపురం: అన్నవరం చప్టాపై నుంచి ప్రవహిస్తున్న వర్షపునీరు



గండిపోశమ్మ ఆలయాన్ని ముంచెత్తిన వరద నీరు

పోటెత్తిన గోదావరి

దేవీపట్నం, జూలై 18: అల్లూరి సీతారామరాజు జిల్లా దేవీపట్నం మండలంలో గోదావరి పరీవాహక ప్రాంతాలైన కొండమొదలు, కచ్చులూరు, గొందూరు, మంటూరు, మూలపాడు, అగ్రహారం, తొయ్యేరు, పూడిపల్లి, పోశమ్మగండి తదితర గ్రామాలు ముంపునకు గురయ్యాయి. ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన మాతృశ్రీ గండిపోశమ్మ అమ్మవారి ఆలయాన్ని గురువారం వరదనీరు చుట్టుముట్టడంతో అమ్మవారి విగ్రహం సగం వరకు నీట మునిగింది. దీంతో తాత్కాలికంగా అమ్మవారి దర్శనాలు నిలిపివేశారు. అలాగే పాపికొండలు విహారయాత్రను గత రెండు రోజుల నుంచి నిలుపుదల చేశారు. దండంగి వద్ద ఉన్న సీతపల్లి వాగుకు వరదనీరు ఎక్కువగా చేరడంతో వాగుకు అటువైపు ఉన్న చొప్పకొండ, గంగవరం, దామనపల్లి, కె.రామన్నపాలెం, మద్దిరాతిగూడెం తదితర గ్రామాలకు ప్రభుత్వ కార్యాలయాలకు మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. గురువారం ఉదయం నుంచి వర్షం అధికంగా కురవడంతో వాగులు పొంగి ప్రవహించి జనజీవనం స్తంభించింది. అలాగే ఎటపాక మండలం చింతలచెరువు గ్రామంలో వరదనీటికి రహదారి కొట్టుకుపోయింది. నల్లకుంట-గౌరీదేవిపేట గ్రామాల మధ్యలో రహదారిపై వరద ఉధృతి ఎక్కువవడంతో రాకపోకలు నిలిచిపోయాయి.

ఎటపాక, జూలై 18: ఏజెన్సీలో ఉదయం నుంచి రాత్రి వరకు విరామం లేకుండా కుండపోతగా వర్షం పడడంతో జనజీవనం స్తంభించింది. వర్షం ధాటికి కృష్ణవరం పంచాయతీలోని చింతలచెరువు గ్రామం వెళ్లే ప్రధాన రహదారి కొట్టుకుపోయింది. రహదారికి ఇరువైపులా దెబ్బతింది. దీంతో ఇటు వైపు రాకపోకలు నిలిచిపోయాయి. నల్లకుంట-గౌరీదేవిపేట గ్రామాల మధ్యలో కల్వర్టు సమీపంలో రహదారిపై వరదనీరు ఉధృతంగా ప్రవహించింది. ఈ గ్రామాలకు మధ్యాహ్నం వరకు రాకపోకలు నిలిచాయి. భారీ వర్షానికి కృష్ణవరం గ్రామ శివారులోని కల్వర్టు ప్రాంతం వద్ద రహదారిని వరదనీరు ముంచెత్తింది. రహదారిపై ఉధృతంగా వరద ప్రవహించింది. దీంతో గిరిజనులు నడుములోతు నీటిలో ప్రమాదపు అంచున రాకపోకలు సాగిస్తున్నారు. మరోవైపు భారీ వర్షం ధాటికి అనేక గ్రామాల్లో వరదనీరు రహదారిపై ప్రవహిస్తూ, డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేనిచోట వరదనీరు ఇళ్లలోకి చేరింది. భారీ వర్షానికి ప్రాజెక్టులు, చెరువులు, పంట పొలాలు నిండిపోయాయి. భారీ వర్షం ధాటికి ప్రజల దైనందిన జీవితానికి తీవ్ర ఆటంకం ఏర్పడింది.

తెగిపోయిన ప్రధాన రహదారి



కృష్ణవరం గ్రామ శివారులో ప్రమాదకరంగా రాకపోకలు సాగిస్తున్న గిరిజనులు

లంక గ్రామాల వైపు వరదనీరు

బూరుగులంక నదీపాయలో గోదారి పరవళ్లు



పి.గన్నవరం, జూలై 18: గోదావరి నది ఎగువన వివిధ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు వరద నెమ్మదిగా పెరుగుతోంది. భద్రాచలంలో నీటి మట్టం పెరుగుతుండడంతో ధవళేశ్వరం బ్యారేజీ నుంచి మిగులు జలాలను సముద్రంలోకి వదులుతున్నారు. దీంతో కోనసీమ జిల్లాలోని గౌతమి, వృద్ధ గౌతమి, వశిష్ఠ, వైనతేయ నదీపాయలకు వరద తాకిడి మొదలైంది. పి.గన్నవరం మండలం గంటి పెదపూడి, ఉడిమూడికి చెందిన నాలుగు లంక గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించేందుకు బూరుగులంక నదీపాయ వద్ద ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక రహదారి గురువారం సాయంత్రం వరద ఉధృతికి నీటిలో కొట్టుకుపోయింది. ఆ సమయంలో రాకాసి అలలు ఎగసిపడటంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. గట్టుపైకి నీరు ప్రవహించిన అరగంటలోనే గట్టు పూర్తిగా కొట్టుకుపోవడంతో గంటి పెదపూడి శివారు పెదపూడిలంక, బూరుగులంక, అరిగెలవారిపేట, ఉడిమూడి శివారు ఉడిమూడిలంక గ్రామాల ప్రజలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. ఎర్ర నీరు పోయి తెలుపు నీరు వచ్చే వరకు నాలుగు నెలల పాటు లంక గ్రామస్తులు నాటు పడవలపైనే ప్రయాణం సాగించాల్సి ఉంది. తాత్కాలిక రహదారి కొట్టుకుపోతుందన్న ముందు జాగ్రత్తతో లంక గ్రామస్తులు తమ ద్విచక్ర వాహనాలను ఇవతలి ఒడ్డునే ఉంచేశారు. ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ నదీపాయను పరిశీలించి ఇంజను బోటుపై అవతలి ఒడ్డుకు వెళ్లి తక్షణం చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో మాట్లాడారు.

రెండు ఇంజన్ బోట్లు ఏర్పాటు చేశాం

ఎస్‌కే హుస్సేన్, తహసీల్దారు

గంటి పెదపూడి శివారు బూరుగులంక వద్ద వరద ప్రవాహంలో తాత్కాలిక రహదారి కొట్టుకుపోవడంతో లంక గ్రామాల ప్రజల రాకపోకల నిమిత్తం రెండు ఇంజన్ పడవలు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ ఎస్‌కే హుస్సేన్ తెలిపారు. ఎస్ఐ బి.శివకృష్ణతో కలిసి ఆయన నదీపాయను పరిశీలించారు. రక్షణ నిమిత్తం లైఫ్ జాకెట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నదీపాయ వద్ద రెవెన్యూ సిబ్బందితో పాటు పోలీసులు కూడా ఉండేలా ఆదేశాలు జారీ చేసామని చెప్పారు.

హుండీ చోరీ కేసులో ఇద్దరు మైనర్లతో సహా ముగ్గురి అరెస్టు

గొల్లప్రోలు, జూలై 18: ఆలయంలోని హుండీ చోరీ కేసులో ఇద్దరు మైనర్లు సహా ముగ్గురిని గొల్లప్రోలు పోలీసులు అరెస్టు చేశారు. గొల్లప్రోలు పట్టణంలోని రాయవరం రోడ్డులో వినాయక ఆలయం తలుపులు, హుండీ బద్దలు కొట్టి నగదును గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసిన సంగతి తెలిసిందే. ఈ చోరీకి పాల్పడిన పిఠాపురం మండలం కుమారపురం గ్రామానికి చెందిన గుబ్బల దయానందపాల్(20)తో పాటు పిఠాపురం పట్టణానికి చెందిన 15, 16 సంవత్సరాలు వయస్సు కలిగిన ఇద్దరు మైనర్లను అరెస్టు చేసి రూ. 1070 నగదు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పిఠాపురం సీఐ శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్ఐ జానీబాషా తెలిపారు.

నన్నయ ఇన్‌చార్జి వీసీగా శ్రీనివాసరావు



దివాన్‌చెరువు, జూలై 18: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి ఉపకులపతిగా ఆచార్య వై.శ్రీనివాసరావును నియమిస్తూ గురువారం ఉన్నత విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. నన్నయ విశ్వవిద్యాలయం భూగర్భ శాస్త్ర విభాగంలో ప్రొఫెసర్‌గా, ఫ్యాకల్టీ ఆఫ్ సైన్సెస్ డీన్‌గా, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్‌గా శ్రీనివాసరావు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. వీసీ కార్యాలయంలో గురువారం సాయంత్రం ఆయన వీసీగా బాధ్యతలు స్వీకరించారు. తనపై ఉన్న నమ్మకంతో వర్సిటీ ఇన్‌చార్జి వీసీగా నియమించిన గవర్నర్, యూనివర్సిటీ కులపతి అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, విద్యాశాఖమంత్రి నారా లోకేశ్, నాయకులు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. నన్నయ విశ్వవిద్యాలయం అభివృద్ధికి త్రికరణశుద్ధిగా పనిచేస్తానన్నారు.

జేఎన్టీయూకే ఇన్‌చార్జి వీసీగా మురళీకృష్ణ



మురళీకృష్ణ

జేఎన్టీయూకే, జూలై 18: ఏపీలోని 17 జేఎన్టీయూకే ఓడీఎల్, ఓఎల్ డైరెక్టర్, సివిల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణను జేఎన్టీయూకే ఇన్‌చార్జ్ వీసీగా నియమించారు. ఆయన గతంలో అకడమిక్ ప్లానింగ్ డైరెక్టర్‌గాను, యూసీఈఎన్ ప్రిన్సిపాల్‌గాను విధులు నిర్వహించారు. 2015లో రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును సాధించారు. ఆయన రచించిన 120 పేపర్లు ప్రచురణ కాగా 27 పుస్తకాలకు ఆథర్‌గా వ్యవహరించారు. జేఎన్టీయూకేలోని యూసీఈకే ఈఈఈ విభాగం ప్రొఫెసర్ ఆర్.శ్రీనివాసరావు మచిలీపట్నంలోని కృష్ణా విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జ్ ఉపకులపతిగా నియమితులయ్యారు. ఆయన గతంలో డీఈగాను, డీఏపీగాను, ఇన్‌ఛార్జ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వర్తించారు.

విద్యుత్ తీగ తగిలి వ్యక్తి మృతి

శంఖవరం, జూలై 18: విద్యుత్ తీగ తగిలి శంఖవరం గ్రామానికి చెందిన కోన వీరలోవకుమార్ మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం... మేకల మేతకు వెళ్లిన కుమార్ చెట్టు కొమ్మను కర్రకు కట్టి కత్తితో నరకుతుండగా కత్తి కర్ర విద్యుత్ తీగకు తగిలింది. దీంతో కుమార్ విద్యుత్ షాక్‌కు గురై మరణించాడు. టీడీపీ సీనియర్ నేత పర్వత సురేష్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ప్రభుత్వపరంగా సాయం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు.

లారీ ఢీకొని దుర్మరణం



సామర్లకోట, జూలై 18: సామర్లకోట-హుస్సేన్‌పురం కెనాల్ రోడ్‌లో గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో మోటార్‌సైకిల్‌పై వెళుతున్న జి.మేడపాడుకు చెందిన గోనుపూడి రాజు(35) తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఇదే ప్రమాదంలో ఇద్దరు మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రాజు తన భార్య సునీతతో కలిసి సామర్లకోటకు వెళ్లి తిరిగి మోటార్ సైకిల్‌పై సామర్లకోట నుంచి జి.మేడపాడుకు వెళుతుండగా హుస్సేన్‌పురం సమీపించేసరికి రోడ్డు పక్క వేచి ఉన్న శిరీషను మోటార్‌సైకిల్ ఎక్కించుకునేందుకు ఆగడంతో అదే సమయంలో వెనుక నుంచి లారీ అతి వేగంగా మోటార్‌సైకిల్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో రాజు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం పెద్దాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సామర్లకోట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పరమేశ్వరుడికి సహస్ర ఘటాభిషేకం



గొల్లప్రోలు రూరల్, జూలై 18: వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పుష్కలంగా పండాలని, అందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటూ గురువారం దుర్గాడ శివాలయంలో సహస్ర ఘటాభిషేకం నిర్వహించారు. గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామంలోని శివాలయం మరోమారు సహస్ర ఘటాభిషేకానికి వేదికగా నిలిచింది. 48 సంవత్సరాలుగా ప్రతి ఏటా తొలి ఏకాదశి మరుసటి రోజు ద్వాదశి పర్వదినాన క్రమం తప్పకుండా నిర్వహించే ఈ కార్యక్రమం గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ జరిగింది. గ్రామంలోని శివాలయంలో వేంచేసి ఉన్న పంచాయతన సమేత ఉమారామలింగేశ్వరస్వామిని గ్రామస్తులు జలాలతో అభిషేకించారు. ముందుగా మహిళలు తమ ఇళ్ల నుంచి పసుపు జలాలు తీసుకువచ్చి స్వామిని అభిషేకించారు. తదనంతరం ఆలయ ప్రాంగణంలోని కోనేటి నుంచి నీటిని బిందెలతో తీసుకువచ్చి శివలింగం పూర్తిగా నిండేవరకూ అభిషేకం నిర్వహించారు. ప్రత్యేక పూజలు జరిగాయి. సహస్ర ఘటాభిషేకం జరుగుతున్నంతసేపు ఆలయ పరిసరాలన్ని భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు ఆధ్వర్యంలో ఆదిత్య శర్మ, షణ్ముఖశర్మ, కారుణ్య, కార్తీక్, రామకృష్ణ, ఫణి, దిలీప్ శర్మ సహస్ర ఘటాభిషేకం, మహాన్యాపూర్వకంగా 11 రుద్రాలతో అభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించగా కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



బిందెలతో క్యూలో ఉన్న భక్తులు

లారీ ఢీకొనడంతో వృద్ధురాలి మృతి



అనంతలక్ష్మి

మండపేట, జూలై 18: లారీ ఢీకొనడంతో గురువారం ఓ వృద్ధురాలు మృతిచెందింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట తర్వాణిపేటకు చెందిన ఇంటి అనంతలక్ష్మి (69) ద్వారపూడి పంచాయతీ పరిధి వేములపల్లిలో ఉన్న పరిశ్రమలో పనిచేస్తుంది. ఆమెకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. గురువారం పరిశ్రమలో పని ముగించుకుని వస్తున్న ఆమెను రాజానగరం మండలం తుంగపాడు నుంచి ద్వారపూడి వైపు వస్తున్న విజయవాడకు చెందిన లారీ వెనుక నుంచి ఢీకొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నామని పోలీసులు తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని రూరల్ ఏఎస్ఐ అప్పారావు తెలిపారు.

డీఎల్‌ఎంటీలకు శిక్షణ తరగతులు ప్రారంభం

సామర్లకోట, జూలై 18: గ్రామాలలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సామర్లకోట విస్తరణ శిక్షణా కేంద్రం ఆవరణలో వివిధ అంశాలలో నిష్ణాతులైన అధికారులు అందించే శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఈటీసీ ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ సూచించారు. సామర్లకోట విస్తరణ శిక్షణా కేంద్రం అవరణలో గురువారం జిల్లా స్థాయి మాస్టర్ లెవెల్ (డీఎల్ఎంటీ) అభ్యర్థులకు మూడు రోజుల శిక్షణా తరగతులను ప్రిన్సిపాల్ వేణుగోపాల్ ప్రారంభించారు. వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్ మాట్లాడుతూ మూడురోజుల పాటు శిక్షణ పొందిన డీఎల్ఎంటీలు జిల్లాస్థాయిలో గ్రామాల నుంచి ఎంపిక చేసిన వారికి శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఈ శిక్షణా తరగతులు తొమ్మిది రోజుల పాటు జరగనుండగా ఒక్కో బ్యాచ్‌కు మూడు రోజులు చొప్పున రెసిడెన్షియల్ పద్ధతిన శిక్షణా తరగతులు నిర్వహించనుండగా శ్రీకాకుళం నుంచి ఏలూరు జిల్లాల వరకూ 11 జిల్లాల నుంచి మూడు బ్యాచ్‌లుగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఫ్యాకల్టీ జీవీ శ్రీదేవి, పి.శ్రీనివాసరావు, వి.ప్రసాద్ వివిధ అంశాలను వివరించారు. మొదటి రోజు శిక్షణా తరగతులకు 72 మంది హాజరయ్యారు.

జేఎన్టీయూకేలో ఐసీపీ కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న దృశ్యం

జేఎన్టీయూకే, జూలై 18: ఇంటర్నేషనల్ కొలాబొరేటివ్ ప్రోగ్రాం(ఐసీపీ) కోర్సుల్లో సీట్ల భర్తీ సంబంధించిన కౌన్సెలింగ్‌ను గురువారం జేఎన్టీయూకేలోని సెనేట్‌హాల్లో వర్సిటీ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఏఎం ప్రసాద్, ఎఫ్‌యూఏఆర్ డైరెక్టర్ శివనాగరాజు, యూసీఈకే ప్రిన్సిపాల్ ఎంహెచ్ఎం కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మొదటిగా ఐసీ డైరెక్టర్ గురుదత్ వేల్పుల ఐసీపీ కోర్సు గురించి విద్యార్థులకు, తల్లిదండ్రులకు వివరించారు. ఈ కోర్సులో చేరిన విద్యార్థులు మొదటి మూడేళ్లు కాకినాడ జేఎన్టీయూకేలోనూ చివరి మూడేళ్లు బీటీహెచ్ స్వీడన్‌లోనూ చదవాల్సి ఉంటుందన్నారు. 4వ ఏడాది కోర్సును బీటీహెచ్‌లో పూర్తిచేశాకా ప్రోగ్రాంనుంచి వైదొలిగే అవకాశం ఉందని తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు అడిగిన పలు సందేహాలను ఆయన నివృత్తి చేశారు. సీఎస్ఈ, ఏఐఎంఎల్, ఈసీఈ కోర్సుల్లో మొత్తం 60సీట్లు ఉండగా మొత్తం 73మంది దరఖాస్తు చేశారని అడ్మిషన్స్ డైరెక్టర్ ఏఎం ప్రసాద్ తెలిపారు. కౌన్సెలింగ్ ద్వారా సీఎస్ఈలో 5, ఏఐఎంఎల్‌లో 12, ఈసీఈలో రెండు సీట్లు భర్తీ అయ్యాయన్నారు. త్వరలో మిగిలిన సీట్ల భర్తీకి సంబంధించిన రెండోదశ కౌన్సెలింగ్‌ను నిర్వహిస్తామని తెలిపారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

అన్నవరం, జూలై 18: అన్నవరం దేవస్థానంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి గురువారం గండి భరత్‌కుమార్ రెడ్డి లక్ష రూపాయలు విరాళంగా సమర్పించారు. ఈ మొత్తాన్ని దాత ఆలయ పీఆర్వో కృష్ణారావుకు అందజేయగా దాత ఆయనను అభినందించి స్వామి వారి ప్రసాదం అందజేశారు.





పాటు చేస్తేనే పూట గడిచేది..

వానొచ్చినా.. వరదొచ్చినా.. రెక్కాడితే గానీ వారికి పూట గడవదు.. కడుపు నింపుకునేందుకు ఎటువంటి విపత్కర పరిస్థితుల్లోనైనా పనికి పోవాల్సిందే. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో రోజంతా హోరున వాన..గోదావరి మొదటి ప్రమాద హెచ్చరికలను దాటి ఉరకలు పెడుతోంది. అయినా లంకల్లో జీవనం సాగించే మత్స్యకారులకు మాత్రం వేట తప్పలేదు. గురువారం వారు వేటకు వెళుతున్న దృశ్యాలు 'ఆంధ్రజ్యోతి'కి కనిపించాయి.

–రాజమహేంద్రవరం (ఆంధ్రజ్యోతి)

రేపు జడ్పీ స్థాయీ సంఘాల సమావేశం

కాకినాడ సిటీ, జూలై 18: ఈనెల 20వ తేదీ శనివారం ఉదయం 10.30 గంటలకు కాకినాడలోని జడ్పీ సమావేశ మందిరంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశం ఏర్పాటు చేసినట్లు జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు తెలిపారు. ఏడు స్థాయీ సంఘాల సమావేశాలు ఆయా చైర్మన్ల అధ్యక్షతన జరుగుతాయన్నారు. ఈ సమావేశాలకు స్థాయీ సంఘాల సభ్యులు, అధికారులందరూ హాజరుకావాలని ఆయన కోరారు.

వెంకన్న ఆలయానికి సెంట్రల్ ఏసీ బహూకరణ



దాతకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఈవో

ఆత్రేయపురం, జూలై 18: వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి అంతరాలయం, గర్భాలయానికి రూ.19 లక్షల వ్యయంతో సెంట్రల్ ఎయిర్ కండిషనర్‌ను రాజమహేంద్రవరానికి చెందిన పోతల వేణుగోపాలరావు బహూకరించారు. దాతకు ఆలయ ఉప కమిషనరు, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ స్వామివారి చిత్రపటం అందజేశారు. వివిధ సేవల ద్వారా గురువారం ఒక్కరోజు ఆదాయం రూ.1,64,588 లభించినట్టు ఈవో చెప్పారు.

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఏజెన్సీ సమాచారం

వరద ప్రభావిత ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలి

గజ ఈతగాళ్లు, బోట్లు సిద్ధంగా ఉంచాం

జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ దినేష్

పాడేరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో అధికారులు అప్రమత్తంగా ఉంటూ సహాయ, పునరావాస చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ ఆదేశించారు. వరదల నేపథ్యంలో చేపట్టాల్సిన చర్యలపై అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. అలాగే వరద సహాయక చర్యలకు సంబంధించిన సామగ్రి, ఇతర పరికరాలను సిద్ధం చేసుకోవాలన్నారు. పునరావాస కేంద్రాలకు తాత్కాలిక లేఅవుట్లు ఏర్పాటు చేయాలని, అవసరమైన నిత్యావసర సరకులు సిద్ధం చేయాలన్నారు. అంతకుముందు వరదలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ దినేశ్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. జిల్లాలో చింతూరు డివిజన్ పరిధిలో 174 గ్రామాలకు వరద ప్రభావం ఉంటుందని, అక్కడి అధికారులను అప్రమత్తం చేశామన్నారు. మొదటి ప్రమాద హెచ్చరిక రాగానే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తామని, అవసరమైన బోట్లు, గజ ఈతగాళ్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అలాగే 8,800 టార్పాలిన్లు, 20 జనరేటర్లను సమకూరుస్తున్నామని, వరద ముంపు ప్రాంతాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ, జిల్లా రెవెన్యూ అధికారి బి.పద్మావతి, డీఆర్‌డీఏ పీడీ వి.మురళీ, అధికారులు పాల్గొన్నారు.

వరదలపై దృష్టి సారించండి: ఎస్పీ బర్దర్

చింతూరు, జూలై 18 : వర్షాలు విస్తారంగా కురుస్తున్న క్రమంలో వాగులు పొంగుతున్నాయని ఈ క్రమంలో వరదలపై దృష్టి సారించాలని ఎస్పీ అమిత్ బర్దర్ సూచించారు. గురువారం ఎస్పీ చింతూరు డివిజనులోని పోలీసు స్టేషన్లను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలిచ్చారు. వరదల కారణంగా ఎటువంటి దురదృష్టకర సంఘటనలు చోటు చేసుకోకూడదన్నారు. ముంపు ప్రాంతాలకు పోలీసు సహకారం అందించాలన్నారు. అదే దశలో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలు మీదుగా ఏ ఒక్కరిని దాటనివ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నూతనంగా నిర్మితమవుతున్న భవనాలను త్వరితగతిన పూర్తి చేయించాలన్నారు. ఏఎస్పీ రాహుల్ మీనా, చింతూరు సీఐ గజేంద్రకుమార్, ఎస్ఐ శ్రీనివాసరావు సిబ్బంది పాల్గొన్నారు.

జగన్ పాలనంతా దందాలు, దౌర్జన్యాలే..

ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీష

రంపచోడవరం, జూలై 18: ఐదేళ్ల జగన్ పాలనంతా లెక్కలేనన్ని దోపిడీలు, భూదందాలు, అక్రమాలతోనే ముగిసిపోయిందని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు. గురువారం రంపచోడవరంలోని తన క్యాంపు కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే చిన్నం బాబూరమేష్, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు ఎమ్.విజయబాస్కర్, ఇతర నాయకులతో కలిసి నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ చంద్రబాబు సారధ్యంలోని కూటమి ప్రభుత్వం పారదర్శక పాలనతో రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు సిద్ధంగా ఉందని అన్నారు. గత ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం దోపిడీ చేయడమే పాలనగా చేసిందన్నారు.చంద్రబాబు విడుదల చేసిన శ్వేతపత్రంలోని అంశాలను ఎమ్మెల్యే ఉటంకించారు. భూదందాలో రూ.35,576 కోట్లు, ఇసుక దందాలో రూ.3,750 కోట్లు ఇలా ప్రతి రంగంలోనూ జగన్ మార్కు అక్రమాలు కనబడుతున్నాయన్నారు. తెలుగుదేశం నాయకులు అడబాల బాపిరాజు, కరకా వెంకటరమణ, పి.మోహన్ సలాది బాపిరాజు, సింహాచలం, చవలం బాపిరాజు, పాము అర్జున, బీజేపీ నాయకులు వీకా బుల్లికొండదొర, బొజ్జిరెడ్డి, వీరబాబు, జనసేన నాయకులు కుర్ల రాజశేఖర రెడ్డి, పాపోలు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

హైవే నిర్మాణ బాధితులకు న్యాయం చేస్తాం

రాజవొమ్మంగి జూలై 18: జాతీయ రహదారి నిర్మాణంలో భూమి, భవనాలు కోల్పోయిన అర్హులైన బాధితులకు తప్పక నష్టపరిహారం అందుతుందని రంపచోడవరం సబ్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్ తెలిపారు. రంపచోడవరంలో ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌లో రాజవొమ్మంగి మండలం జడ్డంగి గ్రామం నుంచి అధికంగా సమస్యలు వస్తుండడంతో రంపచోడవరం సబ్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్ గురువారం జడ్డంగి గ్రామనికి వచ్చి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. జాతీయ రహదారికి ఆనుకొని బస్ షెల్టర్లు నిర్మించాలని, జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న వీధి రోడ్లకు అప్రోచ్ రోడ్డు వేయాలని, వీధిలైట్లు, తాగునీరు తదితర సమస్యలను ప్రజలు నాయకులు సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. సబ్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా భూమి, భవనాలు కోల్పోయిన ప్రజలకు చాలా వరకు నష్టపరిహారం వారి బ్యాంక్ ఖాతాలలో పడ్డాయని, మిగిలిన వారికి త్వరలోనే జమ అవుతాయన్నారు. 102 ఎకరాలు జాతీయ రహదారి నిర్మాణానికి తీసుకోవాల్సి ఉండగా ఇప్పటికే 50 ఎకరాల భూమి తీసుకున్నామని, మరో 20 ఎకరాలు సివిల్ డిపాజిట్‌లో ఉందని అన్నారు. జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా కల్వర్ట్‌లు, పైప్‌లైన్లను తొలగించడంతో ప్రజల ఇబ్బందులు తమ దృష్టికి వచ్చాయని, వాటిపై సంబంధిత కాంట్రాక్టర్ చర్యలు చేపట్టేలా ఆదేశిస్తామని వారి పరిధిలో పని జరగకపోతే తాము చేస్తామన్నారు. తహశీల్దార్ సత్యనారాయణ, సర్పంచ్ కె.మురళీకృష్ణ, జడ్పీటీసీ వడుగుల జ్యోతి, టీడీపీ మండలాధ్యక్షుడు గొల్లపూడి పెద్దిరాజు, మాజీ సొసైటీ అధ్యక్షుడు గణజాల తాతరావు తదితరులు ఉన్నారు.

గంజాయి రవాణాపై ఉక్కుపాదం

ఎటపాక, జూలై 18: ఏజెన్సీలో గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపుతామని, రవాణాపై నిరంతర నిఘా ఏర్పాటు చేశామని అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్‌బర్దర్ స్పష్టం చేశారు. గురువారం జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ ఎటపాక పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. నూతనంగా నిర్మిస్తున్న ఓఎస్డీ కార్యాలయం, పోలీస్ స్టేషన్‌ను పరిశీలించారు. గంజాయి రవాణాను నియంత్రించేందుకు చేపట్టాల్సిన చర్యలపై చింతూరు సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులకు సూచనలు ఇచ్చారు. ఆయన వెంట ఏఎస్పీ రాహుల్‌మీనా, ఎటపాక సీఐ డి.రామారావు పాల్గొన్నారు.

'సూపరింటెండెంట్‌ను బదిలీ చేయాలి'

రంపచోడవరం, జూలై 18: రంపచోడవరం ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ లక్ష్మి, కౌన్సిలర్ వాసులను తక్షణమే బదిలీ చేయాలని డాక్టర్లు, సిబ్బంది బుధవారం నల్లబ్యాడ్జీలు ధరించి ఆసుపత్రి ఎదుట నిరసన తెలిపారు. తాము సక్రమంగా విధులు నిర్వహిస్తున్నప్పటికీ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

సూపరింటెండెంట్‌పై చర్యలు తీసుకోవాలి

రంపచోడవరం ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్‌పై వస్తున్న ఆరోపణలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

లెక్చరర్‌పై కఠినచర్యలు తీసుకోవాలి

దేవీపట్నం, జూలై 18: అడ్డతీగల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకుంటున్న ఆదివాసీ విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డ లెక్చరర్ కుక్కల రామకృష్ణను తక్షణమే కఠినంగా శిక్షించాలని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ డిమాండ్ చేశారు.

జూనియర్ కళాశాల తనిఖీ

రాజవొమ్మంగి జూలై 18: రాజవొమ్మంగి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పలు సమస్యలు ఉన్నాయంటూ కొందరు ఇంటర్మీడియట్ ఉన్నతాధికారులకు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో గురువారం రాజవొమ్మంగి ప్రభుత్వ జూనియర్ కళాశాలను డీఐఈవో అప్పల రాము ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులతో ఆయన మాట్లాడారు. అనంతరం అప్పల రాము మాట్లాడుతూ ఫిర్యాదులో పేర్కొన్న అంశాలు కేవలం ఆరోపణలని, విద్యార్థులు ఎటువంటి సమస్యలు లేవని చెప్పారన్నారు. ఓ సబ్జెక్ట్‌కు లెక్చరర్ లేనట్టుగా గుర్తించామని ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ శిరీష తదితరులు ఉన్నారు.

కుండపోత

- రోజంతా ఎడతెరిపి లేని వాన
- లోతట్టు ప్రాంతాలు, రహదారులు జలమయం
- స్తంభించిన జనజీవనం
- ఇబ్బందులు ఎదుర్కొన్న వాహనదారులు



రాజమహేంద్రవరంలోని రామచంద్రరావుపేటలో నీట మునిగిన రోడ్లు

దివాన్‌చెరువు, జూలై 18: అల్పపీడన ప్రభావంతో గురువారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. తెల్లవారుజామున ప్రారంభమైన చినుకులు మధ్యాహ్నానికి మరింత ఎక్కువై ఎడతెడపి లేకుండా సాయంత్రం వరకు కురుస్తూనే ఉంది. దీంతో ఎక్కడికక్కడ జనజీవనం స్తంభించింది. భారీ వర్షంతో రహదారులన్నీ జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లోకి నీరు చేరింది. మురుగుకాలువలు పొంగి రోడ్లపై ప్రవహించాయి. పంట పొలాల్లోకి వర్షపునీరు చేరడంతో పొలాలన్నీ చెరువులను తలపిస్తున్నాయి. వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. ఉదయం పూట కావడంతో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, కార్యాలయాలకు వెళ్లే సిబ్బంది వర్షంతో ఇక్కట్లను ఎదుర్కొన్నారు. రాజానగరం మండలం నామవరంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రాంగణం వర్షపునీటితో నిండిపోయింది. మధ్యాహ్న భోజనం వండే వంట గదిలోనూ నీరుచేరింది. రోడ్డు కంటె పాఠశాల ప్రాంగణం పల్లంగా ఉండడం, నీరు బయటకు పోయే మార్గం లేకపోవడం వల్ల పాఠశాల ముంపుకు గురైంది. పాఠశాలలోని 127 మంది విద్యార్థులకు గాను గురువారం దాదాపు 80 మంది హాజరయ్యారు. ఉపాధ్యాయులు తగు జాగ్రత్తలు తీసుకుని తరగతులు నిర్వహించారు. విషయం తెలుసుకున్న కూటమి నాయకులు బుడ్డిగ అప్పారావు, నిచ్చెనకోటసాయి, కాకుల శివ, బుడ్డిగ వెంకటరమణ, బుడ్డిగ ముత్యాలరావు, చాట్లరాజు, తీగిరెడ్డి బంగార్రాజు పాఠశాలకు చేరుకుని పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శికి సమాచారం అందించారు. ప్రొక్లెయినర్‌ను రప్పించి పాఠశాల ప్రహరీ గోడ వెంట డ్రైనేజీని ఏర్పాటుచేసి ముంపునీరు తొలగిపోయేలా తాత్కాలిక చర్యలు చేపట్టారు. పాఠశాల భవిష్యత్‌లో మరలా ముంపుబారిన పడకుండా సంబంధిత అధికారులు శాశ్వతచర్యలు చేపట్టాలని కోరారు.

కడియం: కడియంలో రోడ్లన్నీ జలమయంగా మారాయి. నర్సరీల్లో మొక్కల మధ్య నీరు చేరింది. ఎగుమతులు నిలిచిపోయాయి. వర్షం తగ్గిన రెండుమూడు రోజుల వరకు మొక్కల ఎగుమతులు ఉండవని రైతులు చెబుతున్నారు. ఆర్డర్లు ఉన్నా వర్షం తగ్గితేనే మొక్కలు ఎగుమతి జరుగుతుందని అంటున్నారు. మరి కొద్దిరోజుల పాటు వర్షం కురవవచ్చని వాతావరణ శాఖ చెప్పడంతో రైతులు, నర్సరీరైతులు ఆందోళనకు గురవుతున్నారు. నర్సరీ ఎగుమతులు, రవాణా లేక నర్సరీల్లో పనిచేసే కార్మికులు ఖాళీగా ఉన్నారు. కడియంలో వర్షం కారణంగా ప్రజలకు ఇబ్బంది తలెత్తకుండా పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో సచివాలయాల కార్యదర్శి, సిబ్బంది పర్యవేక్షణలో పారిశుధ్య చర్యలు చేయించారు. జేసీబీ సాయంతో డ్రైన్లలో పూడికతీత, ముంపు నీరు బయటకు పోయే మార్గం తీయించారు.

అనపర్తి: అనపర్తిలో అండర్ పాస్ రోడ్డు వర్షపు నీటితో మునిగిపోవడంతో విద్యార్థులు, వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. 3కిలోమీటర్ల మేర ఓవర్ బ్రిడ్జి మీదుగా తిరిగి వెళ్లాల్సి రావడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బేరాలు లేక చిరు వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. ఇప్పుడిప్పుడే వరి నాట్లు జోరందుకోవడంతో వర్షాలు మేలు చేస్తాయని రైతాంగం ఆనందం వ్యక్తం చేస్తోంది.



దివాన్‌చెరువు: నామవరంలో ఎంపీపీ పాఠశాలలోకి చేరిన వర్షం నీరు

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరంలో బుధవారం రాత్రి నుంచి ఒక మోస్తరుగా ఆరంభమైన వాన గురువారం మధ్యాహ్నానికి తీవ్ర రూపం దాల్చి పెద్దఎత్తున పడింది. అన్ని డివిజన్లలో వర్షం కురిసింది. నగరంలో కృష్ణనగర్, రామచంద్రరావుపేట, తుమ్మలోవ, ఆర్యాపురం, దేవిచౌక్, కంబాలచెరువు, హైటెక్ బస్టాండ్, ఏవీఏ రోడ్డు, వీఎస్ పురం, కోరుకొండరోడ్డు, లలితా నగర్, శ్రీరామ్‌నగర్, మునిసిపల్ కాలనీ, పేపరుమిల్లు రోడ్డు, లూథర్ గిరి, తాడితోట, వీఎల్ పురం, రైల్వేస్టేషన్ రోడ్డు ప్రాంతాల్లో డ్రైనేజీలు పొంగిపొర్లి రహదారులు జలమయమయ్యాయి. ఉదయం నుంచి రాత్రి వరకు వర్షం కురిసింది. మరో 48 గంటల పాటు వర్షం కురుస్తుందని వాతావరణ శాఖ స్పష్టం చేసింది. దీంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు కాస్త భయాందోళన చెందుతున్నారు.



రాజమహేంద్రవరం రూరల్: తొర్రేడులో బీసీ కాలనీలో మునిగిన రోడ్లు



అనపర్తిలో నీటమునిగిన అండ్ పాస్ రోడ్డు



కడియంలో నర్సరీ మొక్కల్లోకి చేరిన వర్షపు నీరు

ముంపులో తొర్రేడు బీసీ కాలనీ

రాజమహేంద్రవరం రూరల్, జూలై 18: ఎడతెరపి లేని వర్షాలతో మండలంలోని తొర్రేడు పంచాయతీ పరిధిలోని బీసీ కాలనీ నీట మునిగింది. వాన నీరు ఇళ్లలోకి నీరుచేరింది, వీధులన్నీ జలమయమయ్యాయి. కొన్ని ప్రాంతాల్లో డ్రయినేజీ సౌకర్యం లేకపోవడం, నీరు పోయేందుకు అవుట్‌లెట్ లేకపోవడంతో వర్షం నీరు అంతా కాలనీలోనే వుంటుంది. మిర్తిపాడు నుంచి వచ్చిన నీరు కూడా ఈప్రాంతంలోకే రావడంతో మరింత దారుణంగా వుంది. గతంలో ఈ నీరంతా అక్కడ వున్న కల్వర్టు ద్వారా బయటకు పోయేది. ఈ ప్రాంతంలో మెరక చేసి భవననిర్మాణం చేపట్టడంతో కాలనీ మునగగా మిగిలిన నీరంతా ఎదురుగా వున్న పోలాల్లోకి, ఎస్సీ కాలనీలోకి రావడంతో అక్కడ కూడా నష్టం వాటిల్లుతుందని ఆ ప్రాంత వాసులు చెబుతున్నారు. 4రోజుల క్రితం చిన్న పాటి వర్షానికే కాలనీ మునిగిపోతే కాలనీలోని నీరు ఇంజన్ల ద్వారా పంచాయతీ అధికారులు బయటకు పపించారు. తమ కాలనీని ముంపుబారిన పడకుండా శాశ్వత పరిస్కారం చూపాలంటూ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ప్రాంత వాసులు అర్జీ పెట్టుకున్నారు. తమ సమస్యలపై ఎన్నిసార్లు ఉన్నతాధికారులకు విన్నవించుకున్నా డీపీవో గాని, డీఎల్‌పీవో గాని, ఎంపీడీవో గాని కనీసం పర్యవేక్షించిన పాపాన పోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

ముంపుబారి నుంచి తప్పించేందుకు చర్యలు

- కమిషనర్ దినేష్‌కుమార్.. ముంపు ప్రాంతాల్లో పర్యటన



హైటెక్ బస్టాండ్ వద్ద డ్రైనేజీ పరిస్థితిని పరిశీలిస్తున్న కమిషనర్

రాజమహేంద్రవరం సిటీ, జూలై 18 : రాజమహేంద్రవరాన్ని ముంపుబారిన పడకుండా తప్పించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ దినేష్ కుమార్ పేర్కొన్నారు. నగరంలో కంబాలచెరువు హైటెక్ బస్టాండ్, ఎస్ఆర్‌సీపీ ప్లాంట్, నల్లా చానల్ తదిర ప్రాంతాలను గురువారం కమిషనర్ దినేష్‌కుమార్ పరిశీలించారు. వర్షపు ,మురుగునీటిని ఎప్పటికప్పుడు పంప్ చేయాలని ఆదేశించారు. బుధవారం రాత్రే అన్ని పంపింగ్ స్టేషన్లు అప్రమత్తం చేసినట్టు తెలిపారు. గోదావరి వరదల నేపథ్యంలో అధికారులు సిబ్బంది అంతా అప్రమత్తం ఉండాలని, షిఫ్ట్‌ల విధానంలో విధులు కేటాయించి నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ ఎస్ఈ జిపాండురంగారావు, ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న, ఈఈ, పారిశుధ్య విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలుంటే 94940 60060కు ఫోన్ చేయండి

రానున్న మూడు రోజులు వర్షాలతో పాటు గోదావరి వరద పెరిగే అవకాశమున్నందున 24గంటలు పనిచేసే విధంగా రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని కమిషనర్ దినేష్ కుమార్ తెలిపారు. వర్షాలు పడుతున్నందున నగర ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు ఏమైనా సమస్యలు ఉంటే కంట్రోల్ రూమ్ నెం 94940 60060కు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఎమ్మెల్యే ఆదిరెడ్డి

రాబోయే మూడు రోజులు వర్షాలు పడతాయని వాతావరణ శాఖ స్పష్టం చేసిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సూచించారు. ఈ మేరకు తన కార్యాలయంలో గురువారం మాట్లాడారు. నగరంలో పలు ప్రాంతాల్లో సమస్యలపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నారు.

వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి

విద్యుత్ శాఖ ఈఈ శ్రీధర్‌వర్మ

కోరుకొండ, జూలై 18: ప్రస్తుతం జిల్లాలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని ఏపీఈపీడీసీఎల్ ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ ఓ ప్రకటనలో చెప్పారు. తడిచిన స్తంభాలు, తెగిపడి ఉన్న వైర్లు తాకవద్దని, దగ్గరలో ఉన్న కరెంటు ఆఫీస్, విద్యుత్ అధికారులకు, సిబ్బందికి తెలియజేయాలని కోరారు. అలాగే పాడుబడిన బిల్డింగ్‌లు, మిద్దె ఇళ్లల్లో పాతకాలపు స్విచ్ బోర్డులను, విద్యుత్ లైన్లపై తెగిపడిన కొమ్మలను నేరుగా తాకవద్దని చెప్పారు. కరెంటు సరఫరా జరిగే ప్రమాదముందని ఆయన సూచించారు. వీలైనంతలో రబ్బరు చెప్పులు ధరించడం శ్రేయస్కరమన్నారు. వ్యక్తిగత భద్రత ముఖ్యమని, అన్నింటి కన్నా ప్రాణం మరింత ముఖ్యమైనదని శ్రీధర్ వర్మ పేర్కొన్నారు.

వారం వారం ఇళ్ల నిర్మాణాల ప్రగతిపై సమీక్షిస్తా

హౌసింగ్ అధికారులతో సమీక్షలో కలెక్టర్



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ, జూలై 18: జిల్లాలో ఇళ్ల నిర్మాణాలకు జరిగే మెటీరియల్ కేటాయింపుల వివరాలపై వారం వారం సమీక్ష నిర్వహిస్తానని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం హౌసింగ్ అధికారులతో సమీక్షించారు. ఇళ్ల నిర్మాణం విషయంలో క్షేత్రస్థాయి సిబ్బంది, ఇంజనీరింగ్ సహాయకులు ఇచ్చే నివేదికల ఆధారంగా ప్రగతి వివరాలు సమీక్ష నిర్వహించనని స్పష్టం చేశారు. రానున్న సమీక్షలో ఎన్ని పట్టాలు మంజూరు చేశారు.. ఎన్ని పంపిణీ చేశారు... ఇళ్ల నిర్మాణాల పురోగతి అంశాల ప్రాతిపదికన సమీక్ష నిర్వహిస్తానని చెప్పారు. రాజమహేంద్రవరం డివిజన్‌లో 53,459 మందికి, కొవ్వూరు డివిజన్‌లో 35,283 మందికి పట్టాలు పంపిణీ చేసినట్టు అధికారులు వివరించారు. రానున్న రోజుల్లో నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులను క్షేత్రస్థాయిలో అభివృద్ధి పనుల పర్యవేక్షణకు పంపుతానని చెప్పారు. సమీక్షలో సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, డీఆర్‌వో జి.నరసింహులు, ఆర్‌డీవో చైత్రవర్షిణి, ఇన్ చార్జి జిల్లా హౌసింగ్ అధికారి ఆర్.కృష్ణ నాయక్, ఈఈలు జి.పరశురాం, జి రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రావిపాటి సేవానిరతి గొప్పది

డీఈవో వాసుదేవరావు

కోరుకొండ, జూలై 18: రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంతి జాయింట్ సెక్రటరీ రావిపాటి శ్రీనివాసరావు సేవా నిరతి గొప్పదని విద్యాశాఖాధికారి కంది వాసుదేవరావు అన్నారు. రావిపాటి శ్రీనివాసరావు 94వ జయంతి సందర్భంగా గురువారం కోరుకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన ప్రతిభాపురస్కారాల 10వ వార్షికోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి రావిపాటి సేవలను కొనియాడారు. 2023-24 విద్యాసంవత్సరంలో కోరుకొండ ప్రభుత్వ హైస్కూల్లో చదువుకుని ఉత్తమ ప్రతిభ కనబరిచిన 17 మంది విద్యార్థులకు ఒకొక్కరికి రూ.2900 చెక్కు, ప్రశంసాపత్రం, మెమోంటోను డీ ఈవో అందజేశారు. అలాగే క్రీడల్లో నైపుణ్యం కనబరిచిన ఐదుగురు విద్యార్థులకు రేఖపల్లి విక్రం పేరుమీద ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా రేఖపల్లి పద్మావతి రావిపాటి స్వచ్ఛంధ సంస్థకు రూ.20 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి కోలా సత్యనారాయణ, హెచ్ఎం మణికుమార్, ఎంఈవో సుజా, సర్పంచ్ కర్రి లక్ష్మిసరోజ, రావిపాటి సంస్థ అధ్యక్షురాలు రావిపాటి సత్యవతి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవార్డుల ప్రదానం



విద్యార్థికి అవార్డు అందిస్తున్న డైరెక్టర్ రవి

రాజమహేంద్రవరం సిటీ, జూలై 18: లారెల్ హై గ్లోబల్ స్కూల్లో చదువుకుని అసాధారణ విజయాలు సాధించిన విద్యార్థులకు అవార్డులు ప్రదానం చేశారు. గురువారం స్కూల్లో జరిగిన విద్యార్థుల విజయోత్సవ సభలో స్కూల్ డైరెక్టర్ రవి సుంకర, ఎక్స్‌లెన్స్ సెంటర్ హెడ్ గురునాథ్, కంటిపూడి గ్రూప్ ఆఫ్ కంపెనీ డైరెక్టర్ జగన్ ముళ్ళపూడి విద్యార్థులకు అవార్డులు ప్రదానం చేశారు. స్కూల్లో ఎక్స్‌లెన్స్ సెంటర్ గ్రేడ్ 12 నుంచి ఇంజనీరింగ్ సంస్థలకు విద్యార్థులు ప్రవేశం పొందిన సందర్భంగా ఈ అవార్డులను అందించారు. ఐఐటీ, విదేశీ విశ్వవిద్యాయాలకు ఇతర ప్రముఖ కళాశాలలో వారు ప్రవేశం పొందారని రవికుమార్ తెలిపారు.

జిల్లా ఎస్పీని కలిసిన ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, జూలై 18: జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన డి.నరసింహ కిషోర్‌ను గురువారం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఎస్పీ కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం కృషి చేయాలని కోరారు. నల్లమిల్లి వెంట నాయకులు కర్రి వెంకటరామారెడ్డి, సత్తి దేవదానరెడ్డి తదితరులున్నారు.

బిక్కవోలు: పందలపాక ఉన్నత పాఠశాలలో గురువారం స్టూడెంట్ల కిట్ల పంపిణీ కార్యక్రమానికి రామకృష్ణారెడ్డి విచ్చేసి విద్యార్థులకు కిట్లు పంపిణీ చేశారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. నియోజకవర్గంలో 4247 మంది విద్యార్థులకు రూ.3.51 కోట్లతో కిట్లు అందజేస్తామన్నారు.

టీడీపీ వర్గీయులపై దాడి

బ్లేళ్లతో గాయపరిచిన వైసీపీ వర్గీయులు





దాడిలో గాయపడ్డ సురేష్, పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బత్తుల, బీవీఆర్ చౌదరి

సీతానగరం, జూలై 18: పాత కక్షలు, రాజకీయ కక్షల నేపథ్యంలో తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం బొబ్బిల్లంక గ్రామంలో టీడీపీ వర్గీయులపై వైసీపీ వర్గీయులు దాడికి పాల్పడ్డారు. బుధవారం రాత్రి సుమారు 11గంటల ప్రాంతంలో వైసీపీకి చెందిన జయబాబు అశోక్‌లు టీడీపీకి చెందిన కె.సురేష్, అవినాష్‌లపై దాడిచేసి గాయపర్చారు. బ్లేళ్లతో దాడిచేయడంతో సురేష్ తీవ్రంగా గాయపడగా అవినాష్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. బాధితులు భయంతో పారిపోయి మరుసటిరోజు ఉదయం చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేరారు. ఈ దాడికి రాజకీయ కక్షలే కారణమని స్థానికులు భావిస్తున్నారు. విషయం తెలుసుకున్న రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణచౌదరి ఆసుపత్రికి చేరుకుని బాధితులను పరామర్శించారు. మెరుగైన వైద్య సేవలందించాలని ఆసుపత్రి వర్గాలకు తెలిపారు.

12 గ్యాస్ సిలెండర్లు సీజ్

దివాన్‌చెరువు, జూలై 18: రాజానగరం మండలం కొత్తతుంగపాడులోని కిరాణాషాపును తనిఖీ చేయగా నిబంధనలకు విరుద్ధంగా నిల్వ ఉంచిన 12 గ్యాస్ సిలెండర్లను సీజ్ చేసినట్టు ఎంఎస్‌వో గొలుగూరి బాపిరాజు గురువారం తెలిపారు. సీజ్ చేసిన సిలెండర్లలో హెచ్‌పీ కంపెనీకి చెందినవి నిండువి ఐదు, ఖాళీవి మూడు సిలెండర్లు, ఇండెన్ కంపెనీకి చెందిన ఒక నిండు సిలెండరు, మూడు ఖాళీ సిలెండర్లుగా గుర్తించామన్నారు. సిలెండర్లను సమీపంలోని ఏజెన్సీకి తరరలించి షాపు యజమాని నాళం చంటిబాబుపై6ఏ కేసు నమోదు చేశామని తెలిపారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 18: ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఏపీపీటీడీ యునైటెడ్ వర్కర్స్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరం ఆర్టీసీ జిల్లా అధికారిణి కార్యాలయం (ఆర్టీసీ కాంప్లెక్స్) ఎదుట ధర్నా గురువారం నిర్వహించారు. అధికారిణి షర్మిల అశోకకు వినతిపత్రం అందజేశారు.

అటానమస్ కళాశాలలను బలోపేతం చేయాలి


ఆర్ట్స్ కళాశాలలో మూడు రోజుల వర్క్‌షాపు ప్రారంభం

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 18 : విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి స్వయం ప్రతిపత్తి కల్గిన విద్యాసంస్థలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే అన్నారు. రాష్ట్రంలోని స్వయంప్రతిపత్తి కళాశాల ప్రధానాచార్యులు, ఇతర ముఖ్య సిబ్బందికి మూడు రోజుల వర్క్‌షాపు రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో గురువార ప్రారంభించారు. జోన్ 1 ఆర్‌జేడీ నాగలింగారెడ్డి, జోన్ 2 ఆర్‌జేడీ శోభారాణి, జోన్ 3 ఆర్‌జేడీ కళావతి, జోన్ 4 ఆర్‌జేడీ బాబు తదితరులు మాట్లాడారు. నాయకత్వం, నిర్వహణ లక్షణాల్లో స్వయంప్రతిపత్తి కలిగిన కళాశాలలను సాధికార పరచడం, ప్రభుత్వ అటానమస్ కళాశాలలను అకడమిక్ ఎక్స్‌లెన్స్ కేంద్రాలుగా అభివృద్ధి చేయడం లక్ష్యంగా కమిషనరేట్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్, ఆంధ్రప్రదేశ్ ఈ వర్కుషాపును నిర్వహిస్తుందన్నారు. ఈ వర్కుషాపును అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా 26 స్వయం ప్రతిపత్తి కళాశాలల నుంచి ప్రిన్సిపాల్స్, ఐక్యూఏసీ సమన్వయాధికారులు, అకడమిక్ సెల్ సమన్వయాధికారులు, పరీక్షల నియంత్రణాధికారులు హాజరయ్యారు. మూడు రోజుల వర్క్‌షాపులో భాగంగా ఇన్స్టిట్యూషనల్ డెవలప్‌మెంట్ ప్లాన్, రీసెర్చి పబ్లికేషన్స్, ప్రమోషన్, స్కీంల డెవలప్‌మెంట్ ఆఫ్ ఫండింగ్ రీసెర్చి, అకడమిక్ కౌన్సిల్, బోర్డు ఆఫ్ స్టడీస్‌ను బలోపేతం చేయడానికి ఉత్తమ పద్ధతులు, పాఠ్యాంశాల రూపకల్పన, నిరంతర అంతర్గత మదింపు, ఆవిష్కరణలు వంటివాటిపై అవగాహన కల్పిస్తారు. ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ కె.విజయబాబు, అనిల్‌కుమార్, కాలేజియేట్ ఎడ్యుకేషన్ ఏపీ రిసోర్సు పర్సన్లు, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులకు

హాజరు నమోదు తప్పనిసరి: డీఎల్‌డీవో

రంగంపేట, జూలై 18: సచివాలయ సిబ్బంది ఉదయం, సాయంత్రం తప్పనిసరిగా సచివాలయంలో ఆన్‌లైన్ హాజరు తప్పనిసరిగా నమోదు చేయాలని, లేకుంటే జీతభత్యాలు చెల్లింపబడవని రాజమహేంద్రవరం డీఎల్‌డీవో వీణాదేవి హెచ్చరించారు. గురువారం మండలంలోని రంగంపేట, ఈలకొలను, అచ్యుతాపురం గ్రామాల సచివాలయాలను ఆమె తనిఖీ చేశారు. రంగంపేట 1, 2 సచివాలయాల్లో హాజరుశాతాన్ని, సచివాలయ సిబ్బంది రికార్డులను పరిశీలించారు. మండలంలో విశ్వకర్మ యోజన దరఖాస్తుల స్క్రూట్నీ గురించి సిబ్బంది అడిగి తెలుసుకున్నారు. సచివాలయాల్లో చేపట్టవలసిన ప్రాధాన్యత కార్యక్రమాలు, పారిశుధ్యం, ప్రజారోగ్యంపై పలు ఆదేశాలు జారీచేశారు. అనంతరం ఈలకొలనులో పంచాయతీ కార్యదర్శి మరో మూడు పంచాయతీలకు ఇన్‌చార్జిగా ఉండడానికి బట్టి అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే వేరొక కార్యదర్శిని నియమించాలని ఎంపీడీవో వెంకటరత్నంకు ఆదేశించారు. మండలంలో డయేరియా పట్ల అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అచ్యుతాపురం కోళ్ల ఫారాన్ని పరిశీలించి కోళ్ల పెంట గుట్టలుగా పేరుకుపోవడాన్ని, విపరీతమైన దుర్గంధ రావడంపై సిబ్బందిని నిలదీశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పి.సుబ్బారాయుడు, వెంకన్నబాబు, దినేష్‌రెడ్డి, సర్పంచ్ చింతపల్లి సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



జిల్లాలో ఎక్కడ సమస్య వచ్చినా.. ఫోన్ చేయండి

కలెక్టరేట్	8977935609
రాజమహేంద్రవరం ఆర్డీవో	0883 2442344
కొవ్వూరు సబ్-కలెక్టర్	08812 231488



నిండా ముంచేను : ఉండ్రాజవరంలో నీట మునిగిన వరిచేలు

ముసురేసింది!



రోడ్డు.. చెరువు : దేవరపల్లిలో జాతీయ రహదారిపై నిలిచిన నీళ్లు



నీట మునిగిన ఊరు : నల్లజర్ల మండలం చీపురుగూడెంలో రోడ్లపై ప్రవహిస్తున్న వరద నీరు

32 గంటల పాటు వాన

- భారీ వానతో ఊళ్లు..నీళ్లు
- దేవరపల్లిలో అత్యధిక వర్షపాతం
- ఎస్‌బీఐలోకి చొచ్చుకెళ్లిన నీళ్లు
- నీట మునిగిన రాజమహేంద్రవరం
- చీపురుగూడెంలో వీధుల్లో వరద
- 2615 హెక్టార్లలో పొలాలు మునక
- అధ్వానంగా 130 కి.మీ రోడ్లు
- మరో 48 గంటల పాటు ఇంతే
- జిల్లాలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- గోదావరికి పెరుగుతున్న వరద

రాజమహేంద్రవరం,జూలై 18 (ఆంధ్రజ్యోతి)/రాజమహేంద్రవరం సిటీ : రోజంతా వాన.. తెరిపివ్వలేదు.. బుధవారం సాయంత్రం నుంచి చిను కులు పడుతూనే ఉన్నాయి. డ్రెయినేజీలు పొంగిపొర్లాయి..ఊళ్లకు ఊళ్లు మునిగిపోయాయి.. చేలు చెరువులుగా మారిపోయాయి.. జనజీవనం అస్తవ్యస్తమైంది. రాజమహేంద్రవరం రోడ్లన్నీ వాననీటితో నిండిపోయాయి.. గోదావరి ఉప్పొంగి ప్రవహిస్తుంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో గురువారం జిల్లా అంతటా ఒకటే వాన.. మరో మూడు నాలుగు రోజుల పాటు భారీ నుంచి అతిభారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జనం భయపడుతున్నారు. ఒక్కరోజు వర్షానికే జిల్లా అంతటా నీట మునిగింది. రాజమహేంద్రవరం, కొవ్వూరు, నిడదవోలు పట్టణాల్లో పల్లపు ప్రాంతాలు నీట మునిగాయి. రాజమహేంద్రవరం హైటెక్ బస్టాండ్, ఐఎల్‌టీడీ జంక్షన్, వీఎల్ పురం, దేవిచౌక్, కోరుకొండ రోడ్డు, రామచంద్రరావుపేట, కృష్ణనగర్, తుమ్మలోవ, తాడితోట, ఇన్నీసుపేట, రైల్వే స్టేషన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో డ్రెయినేజీలు పొంగాయి. రోడ్లు కాలువలను తలపించాయి. వాహనదారులు, బాటసారులు ఇబ్బం దులు పడ్డారు. రూరల్ ,కడియం ప్రాంతాల్లో పంటపొలాలు వర్షపు నీటితో నిండాయి. నర్సరీలు నీట మునిగాయి. దేవరపల్లిలో మూడు రోడ్ల సెంటర్, యాదవోలు వాగు వద్ద దళితపేటలో కాల్వలు పొంగి ఇళ్లలోకి, షాపుల్లోకి, స్టేట్‌బ్యాంకులోకి, డిగ్రీ కాలేజీలో భారీగా వరదనీరు చేరింది. జాతీయ రహదారి నీట మునిగింది. గోపాలపురంలో ఓ ఇల్లు కూలిపోయింది. నిడదవోలు ఆర్‌టీసీ డిపో ఎప్పటిలాగే నీట మునిగింది. మంత్రి కందుల దుర్గేష్ స్వయంగా పరిశీలించి ఇంజన్లతో నీటిని తోడి ప్రయాణి కులకు ఇబ్బందిలేకుండా చూడాలని ఆదేశించారు. నల్లజర్ల మండలం చీపురుగూడెం గ్రామంలో వరద నీరు వెళ్లేందుకు మార్గం లేక గ్రామంపై పడి పొంగి ప్రవహిస్తుంది. పుంతలో ముసలమ్మ గుడి వద్ద తూరలు పెట్టేందుకు గతంలో ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రయత్నించగా వైసీపీ వర్గీయులు అడ్డుకున్నారు.దీనితో వరద నీరు సీసీ రోడ్డుపై పొంగి ప్రవాహిస్తు ఎస్సీ కాలనీపై పడుతుంది. జిల్లాలో 2615 హెక్టా ర్లలో వరి పొలాలు మునిగిపోయాయి. ఉద్యాన పంటలు ముంపునకు గురయ్యాయి.చాలా చోట్ల విద్యుత్ అంతరాయం ఏర్పడింది. జిల్లా వ్యాప్తంగా 130 కిలోమీటర్ల మేర ఆర్అం డ్‌బీ రోడ్లు ధ్వంసం అయ్యాయి. వానకు మరింత అధ్వా నంగా తయారయ్యాయి.



ఆటో..ఎటో : రాజమహేంద్రవరంలో నీట మునిగిన ఆటో

కురిసింది వాన..

జిల్లాలో గడచిన 32 గంటల్లో 1274.4 మి.మీ వర్షపాతం నమోదైందని వాతావరణ శాఖ తెలిపింది.దేవరపల్లిలో అత్యధికంగా 124.8 మి.మీ..అత్యల్పంగా గోకవరంలో 21.2 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లాలో ఇతర మండలాలకు సంబంధించి కడియంలో 79.6 మి.మీ, గోపాలపురంలో 77.2 మి.మీ, అనపర్తిలో 56.8 మి.మీ, రాజమహేంద్రవరంలో 84.2 మి.మీ, రూరల్ 79.4 మి.మీ, రాజానగరంలో 24.4 మి.మీ, కోరుకొండలో 59.0 మి.మీ, రంగంపేట 25.4 మి.మీ, సీతానగరంలో 24.2 మి.మీ, కొవ్వూరులో 65.4 మి.మీ, చాగల్లులో 92.4 మి.మీ, నల్లజర్లలో 69.2 మి.మీ, నిడదవోలులో 117.6 మి.మీ, తాళ్ళపూడిలో 78.2 మి.మీ, ఉండ్రాజవరంలో 73.4 మి.మీ,పెరవలిలో 65.6 మి.మీ వర్షపాతం నమోదైంది. బుధవారం రాత్రి 8.30 గంటల నుంచి గురువారం 4 గంటల వరకూ మొత్తం 1274.4 మి.మీ వర్షపాతం నమో దైంది.సరాసరి వర్షపాతం 67.1 మి.మీ ఉంది.మరొక 48 గం టలు వానలు పడతాయని వాతావరణ శాఖ స్పష్టం చేసింది.



గూడు..గోడు : గోపాలపురంలో నేలకూలిన ఇల్లు

కలెక్టర్‌తో మాట్లాడిన ఎంపీ పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 18 : అధిక వర్షాల నేపథ్యంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని .. అధికారులు తగిన చర్యలు చేపట్టాలని రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి సూచించారు. కలెక్టర్‌తో మాట్లాడి వర్షాల కారణంగా తలెత్తే సమస్యలు, ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అధిక వర్షాల కారణంగా రాజమండ్రి పార్లమెంట్ నియోజకవర్గంలో ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే సెల్ 87903 78374, 94923 85664ను సంప్రదించాలని పేర్కొన్నారు.



వానమ్మా..వదలమ్మా : కడియంలో నీట మునిగిన నర్సరీ

ఉప్పొంగుతున్న గోదావరి
సముద్రంలోకి 2.23 లక్షల క్యూసెక్కులు

ధవళేశ్వరం, జూలై 18: గోదావరికి వరద నీరు వచ్చిపడుతుంది. అంతకంతకూ నీటిమట్టం పెరుగుతోంది. ఉపనది ఇంద్రావతి నుంచి వరద నీరు పేరూరి వద్ద కలుస్తుండడంతో గోదావరి నీటిమట్టంలో పెరుగుదల నమోదవుతుంది.ఎగువన గోదావరి పెరుగుతూ ఉండడంతో వచ్చి చేరే వరదనీటిని ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ వద్ద అంచనా వేస్తున్నారు. ఈ మేరకు బ్యారేజ్ 175 గేట్లను అరమీటరు మేర పైకి ఎత్తి 2,23,961 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.దీంతో ధవళేశ్వరం వద్ద నీటిమట్టం 8.20 అడుగులుగా నమోదైంది. ఎగువన భద్రాచలం వద్ద బుధవారం రాత్రికి 20.10 అడుగుల వరకు పెరిగిన నీటిమట్టం ఆపై తగ్గుతూ గురువారం సాయంత్రానికి 18.20 అడుగులకు చేరింది. ఎగువ నుంచి వరద వస్తుండటంతో భద్రాచలం వద్ద మళ్లీ పెరుగుదల కనిపిస్తుంది.

విద్యుత్ సమస్య వస్తే.. డయల్
ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ టీవీఎస్ఎన్ మూర్తి

రాజమహేంద్రవరం సిటీ, జూలై 18: వర్షాల కారణంగా జిల్లాలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగుకుండా సిబ్బందిని అందుబాటులో ఉంచామని ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ టీవీఎస్ఎన్.మూర్తి తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 24/7 సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డివిజన్,జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయి కంట్రోల్ రూమ్ రాజమహేంద్రవరం పర్యవేక్షక ఇంజనీరు కార్యాలయంలో ఏర్పాటు చేశామ న్నారు. రాజమహేంద్రవరంలో జిల్లా స్థాయి కంట్రోల్ రూమ్ నెం 0883-2463354,7382299960, ఏలూరు నెంబరు 9440902926, నిడదవోలు 08813 3221093, 94408 12706, డివిజన్ స్థాయి రాజమహేంద్రవరం టౌన్ 94408 12585, రాజమహేంద్రవరం రూరల్ 7382585487 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

మూడు నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు.. గోదావరి వరదల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. గ్రామ, మండల, డివిజన్ స్థాయి అధికారులతో గురువారం వీడియో, జూమ్ కాన్ఫరెన్స్‌లు నిర్వహించారు.వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఉద్యోగులంతా ముందస్తు కార్యాచరణతో సిద్ధంగా ఉండాలన్నారు. గోదావరి పరీవాహక ప్రాంతాల్లో ఏటిగట్లను పరిశీలించి రక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బలహీనంగా ఉన్న పాత కాజ్‌వేలు, పాత వంతెనలు గుర్తించి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడైనా పాత భవనాల్లో పాఠశాలలు నడుస్తుంటే విద్యార్థులను వేరే భవనాల్లోకి మార్చాలన్నారు.సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు.



బడికెలాపోవాలే!

నిడదవోలు, జూలై 18 : బుధవారం రాత్రి నుంచి జోరున వాన కురుస్తున్నా విద్యాశాఖ గురువారం పాఠశాలలకు సెల వు ప్రకటించలేదు.. దీంతో తల్లిదండ్రులు తమ పిల్లలను బడికి పంపేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోజంతా వాన పడడంతో పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు నీట మునిగాయి. సాయంత్రం బడి నుంచి వచ్చే చిన్నారులను ఇంటికి తెచ్చుకునేందుకు అష్టకష్టాలు పడ్డారు. నిడదవోలులో గురువారం తన ఇద్దరు చిన్నారులు వర్షానికి తడవకుండా ఓ తండ్రి భుజాన ఎత్తుకుని టార్పాలిన్ కప్పి ఇంటికి తీసుకు వెళుతున్న ఫొటో ఆంధ్రజ్యోతి ఇలా క్లిక్‌మనిపించింది. మరో 48 గంటల పాటు వానలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో పాఠశాలలకు సెలవు ప్రకటించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.



రాజమహేంద్రవరం హైటెక్ బస్టాండ్ వద్ద నీటమునిగిన రోడ్డు

మోకాళ్ల లోతు నీటిలోనే మంత్రి దుర్గేష్ పర్యటన

నిడదవోలు, జూలై 18 : భారీ వర్షాలకు పట్టణమంతా జలమయమైంది. ఆర్టీసి డిపో సైతం నీట మునిగి చెరువును తలపించేలా మారిపోయింది. డిపో చుట్టూ నిడదవోలు ఊరు పెరిగిపోవడం.. రోడ్లు ఎత్తు పెరగడంతో డిపో లోత ట్టుగా ఉంటుంది.దీంతో చిన్నపాటి వర్షానికే డిపోలో నీరు నిలిచిపోతోంది. అయినా గత పాలకులు ఏనాడూ అటు వైపు కన్నెత్తి చూడలేదు..సమస్యను పరిష్కరిద్దామని ఆలోచనా చేయలేదు. అయితే ప్రస్తుత ప్రజా ప్రతినిధి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫి మంత్రి కందుల దుర్గేష్ భారీ వర్షాలకు జలమయమైన ఆర్టీసి డిపోను మోకాళ్ళ లోతు నీటిలో వెళ్లి పరిశీలించారు. భవిష్యత్తులో మరోసారి ఇలాంటి సంఘటన పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులు ఆదేశించారు.



దేవరపల్లిలో ఎస్‌బీఐ బ్యాంక్‌లోకి వెళుతున్న నీరు

రేపే అర్బన్ బ్యాంక్ పోలింగ్

- చల్లా ప్యానల్‌కు కూటమి నేతల మద్దతు
- జగన్ ఫొటో లేకుండా వైసీపీ నేతల ప్రచారం

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ప్రతిష్ఠాత్మకమైన ఆర్యాపురం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ఎన్నికల పోలింగ్ శనివారం జరగనుంది.ఈ మేరకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో అర్బన్ బ్యాంక్ ఎన్నికలు నిర్వహించలేదు. నామినేటెడ్ తరహాలోనే చైర్మన్‌ను నియమించారు.అయితే ప్రభుత్వం మారడంతో అర్బన్ బ్యాంక్ ఎన్నికలకు నోటిఫికేషన్ ఇచ్చారు. శనివారం పోలింగ్ తేదీగా నిర్ణయించారు. అటు కూటమి..ఇటు వైసీపీ అనుకూల అభ్యర్థులు బరిలో దిగడంతో పోటీ అనివార్యమైంది. 21న ఓట్ల లెక్కింపు ఉంటుంది. రాజమహేంద్రవరం కేంద్రంగా వివిధ జిల్లాల్లో 16 బ్రాంచిలతో రూ.1000 కోట్లకు పైగా టర్నోవర్‌తో ఉన్న అర్బన్ బ్యాంక్‌ను పీఠాన్ని కైవశం చేసుకునేందుకు ఎవరికి వారు పోటీపడుతున్నారు. మొత్తం 12 మంది డైరెక్టర్లతో పాలకవర్గం ఉంటుంది.ఇప్పటికే కూటమికి చెందిన ఓ డైరెక్టర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మిగతా 11 డైరెక్టర్ పదవులకు 20న పోలింగ్ జరగనుంది. కూటమి చైర్మన్ అభ్యర్థిగా మాజీ చైర్మన్ చల్లాశంకరరావు పోటీలో ఉన్నారు. ఆయన ప్యానల్ సభ్యులు కూటమి నేతల ఫొటోలతో విస్తృత ప్రచారం చేస్తున్నారు. వైసీపీ వర్గం ఎక్కడా వైసీపీ ఆనవాళ్లు లేకుండా జాగ్రత్త పడుతోంది.నగర ప్రముఖులు బలపరచిన ప్యానల్ అంటూ వైసీపీ నగర మాజీ అధ్యక్షుడు నందెపు శ్రీనివాస్‌ను చైర్మన్ అభ్యర్థిగా బరిలో దింపి ప్రచారం చేస్తున్నారు. వైసీపీ నేతలు మాత్రం జగన్ బొమ్మ కూడా కనిపించ నీయడం లేదు.వైసీపీ అంటే ఓడిస్తారనే భయం కాబోలు, వైసీపీ పేరుకానీ, జగన్ ప్రస్తావన కానీ తేకుండా ప్రచారం చేస్తున్నారు.

54 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు : కలెక్టర్

ఆర్యాపురం అర్బన్ బ్యాంక్ పోలింగ్ 20న జరుగుతుందని, 21న ఓట్లను లెక్కిస్తామని జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం ఆమె సమీక్షించారు.ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి వీలుగా ఏర్పాట్లు చేశామన్నారు. రాజమహేంద్రవరంలో 48, ఇతర ప్రాంతాల్లో మరో 6 మొత్తం 54 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుం దన్నారు. బందోబస్తుకు 120 మంది సిబ్బందిని ఏర్పాటు చేశామని డీఎస్పీ కె.విజయపాల్ తెలిపారు.జిల్లా కో ఆపరేటివ్ అధికారి ఆర్.శ్రీరాములు నాయుడు మాట్లాడుతూ బ్యాంక్‌కు 16 బ్రాంచిలను మూడు నియోజకవర్గాలుగా విభజించామన్నారు.74.585 మంది ఓటు హక్కు వినియోగించుకుంటారన్నారు.

దయచేసి వినండి.. గొడుగు తెచ్చుకోండి!

రాజమండ్రి రైల్వే స్టేషన్‌కు వస్తే వానలో తడవాల్సిందే..



రాజమహేంద్రవరం, జూలై 18(ఆంధ్రజ్యోతి): రాజమండ్రి రైల్వే స్టేషనులో పరిస్థితులు ఇటీవల రోజురోజుకు దిగజారుతున్నాయి. ఎన్ఎస్‌జీ-2 హోదా..రోజుకు సరాసరి 30,336 మంది ప్రయాణికులు రాకపోకలు.. 120కిపైగా రైళ్లు.. నాలుగు జిల్లాల రైలు ప్రయాణికులకు గేట్‌వే కలిగిన రాజ మహేంద్రవరం రైల్వే స్టేషన్‌లో సమస్యలు పెరుగుతున్నాయి. 'దయచేసి వినండి.. రైల్వే స్టేషనుకు వస్తే గొడుగు తెచ్చుకోండి' అనేలా పరిస్థితులు ఉన్నాయి. ఎందుకంటే రైల్వే స్టేషనులో ప్లాట్‌ఫాంపైకి వెళ్లిన ప్రయాణికులు తడవకుండా రైలెక్కాలంటే కచ్చితంగా అదృష్టం ఉండాల్సిందే.. రైల్వే స్టేషనులో మొత్తం ఐదు ప్లాట్‌ఫాంలు ఉన్నాయి. 1,2,3 ప్లాట్‌ఫాంలపై నిడివికి తగినట్టు పైకప్పు లేదు. వర్షం కురుస్తున్న సమయంలో రైలు వస్తే జనరల్ బోగీల్లో ఎక్కే ప్రయాణికులు తడుస్తూనే రైలులోకి ప్రవేశించాల్సి ఉంటుంది. ఏసీ, స్లీపర్ బోగీల్లో ఎక్కేవాళ్లు ఎంతో కొంత తడవకుండా ఎక్కడం కష్టమే. మొదటి ప్లాట్‌ఫాం ట్రాక్‌పై మరమ్మతుల నిమిత్తం రాకపోకలను ఆపేశారు. ప్రస్తుతం రెండు, మూడు ప్లాట్‌ఫాంలు ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. మొదటి ప్లాట్‌ఫాం నుంచి మిగతా వాటికి వెళ్లడానికి ఎడమ, కుడివైపు మెట్లున్నాయి.కానీ వానలో తడవకుండా ఆ మెట్లు ఎక్కి వెళ్లడం సాధ్యం కాదు. బయట నుంచి నేరుగా వెళ్లేందుకు సదుపాయం ఉన్నా మెట్లపై చినుకులు, ఫుట్‌పాత్‌పై వర్షం నీరు దాటుకుని వెళ్లాల్సిందే. వెయిటింగ్ హాళ్లలోకి వెళ్లాలన్నా.. చివరికి రైల్వే స్టేషనులోకి ప్రవేశించే సమయంలో కూడా వర్షపు నీళ్ల చుక్కలు నెత్తిపై వేసుకోవాల్సిందే. ప్లాట్‌ఫాంలపై వేసిన రేకుల షెడ్ల స్తంభాల చుట్టూ ప్రయాణికులు కూర్చోడానికి సపటాలు కట్టారు.కానీ వాటిపై కూర్చుంటే తల స్నానం చేసినట్లే. సిమెంటుతో నిర్మించిన కుర్చీల్లో అటూ ఇటూ ప్రయాణికులు కూర్చోగా మధ్యలో వర్షం నీరు పడుతోంది. రెండు, మూడు ప్లాట్‌ఫాంలపై ఎస్కలేటర్ పక్కన ఎందుకనో షెడ్లు వేయకుండా వదిలేశారు. అక్కడ వర్షంలో తడవక తప్పదు. దీంతో ప్రయాణికులు ఒకేచోట పోగుబడుతున్నారు. రేకుల షెడ్లకు ఎక్కడపడితే అక్కడ చిల్లులు పడడం, ఆ షెడ్లు గోడకు కలిసే చోట నీటి ప్రవాహానికి సరైన ఏర్పాటు లేకపోవడం, ఆ షెడ్లపైన నీళ్ల కిందికి డ్రైన్లలోకి వెళ్లడానికి స్తంభాలకు అమర్చిన గొట్టాలు పగిలిపో వడంతో ప్లాట్‌ఫాంలు చిత్తడి చిత్తడిగా మారుతున్నాయి. రైలు ఎక్కే చోట యాంటీ స్కిడ్ టైల్సు వేసినా మిగతా ప్రదేశమంతా నున్నటి టైల్సు ఉన్నాయి. దీంతో రైలు వచ్చినపుడు, వెళ్లే సమయంలో హడావుడిలో వర్షపు నీటి వల్ల ప్రయాణికులు జారి పడే ప్రమాదం ఉంది. కొత్తగా నిర్మించిన 4, 5 ప్లాట్‌ఫాంలపై అయితే అసలు ఎక్కడా ఒక్క రేకుతో కూడా అచ్ఛాదన లేదు. రైల్వే స్టేషను ప్రాంగణంలోకి ప్రవేశించే రోడ్డు గోతులు పడడంతో నీళ్లు నిలిచిపోతున్నాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఏడాదికి సుమారు రూ.140 కోట్ల ఆదాయం ఉన్న రైల్వే స్టేషను ఇలా తిప్పలు పడుతుండడంపై నివ్వెరపోతున్నారు.



రాజమండ్రి రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల ఇక్కట్లు



ప్లాట్‌ఫాంపై నిలిచిన వాన నీరు

ఏ పోలీస్ స్టేషన్‌లో అయినా ఫిర్యాదు చేయవచ్చు

జీరో ఎఫ్ఐఆర్ వేయాల్సిందే: ఎస్పీ నరసింహ కిషోర్



రాజమహేంద్రవరం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కొత్త చట్టాల ప్రకారం స్టేషను పరిధితో సంబంధం లేకుండా జిల్లాలోని ఏ ప్రాంతంలోని పోలీసు స్టేషన్‌లో అయినా బాధితులు ఫిర్యాదు చేయవచ్చని ఎస్పీ డి.నరసింహ కిషోర్ స్పష్టం చేశారు.జీరో ఎఫ్ఐఆర్‌తో పాటు పలు అంశాల గురించి వివరించారు. ఘటనా ప్రదేశం తమ పరిధిలోకి రాదంటూ పోలీసులు తిరస్కరించడానికి వీల్లేదన్నారు. ఫిర్యాదు స్వీక రించి విచారణ జరిపి సంఘటనా స్థలం పరిధి పోలీస్ స్టేషనుకు సదరు ఫిర్యాదును బదిలీ చేయాలని తెలిపారు. కోర్టు అనుమతి లేకపోయినా పోలీసులు నేరుగా అరెస్టు చేసే వాటిని కాగ్నిజబుల్ కేసులు అం టారన్నారు. తమ దృష్టికి వచ్చిన వెంటనే పరిధి, ఫిర్యాదుదారు ఎవరనే దాంతో సంబంధం లేకుండా కేసు నమోదు చేయాలన్నారు. బాధితులు, కుటుంబ సభ్యులు లేదా నేరం గురించి తెలిసిన ఎవరైనా సరే ఫిర్యాదు చేయవచ్చన్నారు. గ్రామ సచివాలయాల్లో కూడా మహిళలు ఫిర్యాదు చేసే వెసులుబాటు ఉంద న్నారు. మహిళల భద్రత, రక్షణ, రూల్ ఆఫ్ లా, పోలీసు సమస్యలు, శాంతి భద్రతలు, మహిళా శిశు సంక్షేమ సేవలపై మహిళా పోలీసులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. పోలీసు సహాయం అవసరమైన వారు డయల్ 112 టోల్‌ఫ్రీ నెంబరుకు గానీ పోలీస్ స్టేషనుకు గానీ ఫోన్ చేయాలని సూచించారు.

స్టాక్ పాయింట్ల నుంచి ఇసుక రవాణా నేరం
జిల్లా మైన్స్ అండ్ భూగర్భ అధికారి సుబ్రహ్మణ్యం

రాజమహేంద్రవరం సిటీ, జూలై 18 : జిల్లాలోని ఇసుక నిల్వలు ఉన్న ఏడు పాయింట్ల నుంచి ఇసుక లోడింగ్, రవాణా వంటివి చేయడం చట్ట రీత్యా నేరమని జిల్లామైన్స్ అండ్ భూగర్భ అధికారి ఎం.సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో లారీ ఓనర్స్ అండ్ డ్రైవర్లకు విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఎవరైనా స్టాక్ పాయింట్ల నుంచి ఇసుకను లోడింగ్ చేయించుకుని రవాణా చేసిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. స్టాక్ పాయింట్ల నుంచి రవాణాకు అనుమతులు ఇచ్చే వరకు లారీ డ్రైవర్లు వెళ్లరాదని తెలిపారు.

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం



తాళ్లపూడి: తిరుగుడుమెట్టలో చెరువులను తలపిస్తున్న పంట పొలాలు



దేవరపల్లిలో వాన నీటి నివారణ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి



దేవరపల్లిలో నీటమునిగిన ఇళ్లు



నిడదవోలులో కురుస్తున్న వర్షం



దేవరపల్లిలో స్టేట్ బ్యాంక్‌లో చేరిన వర్షపు నీరు



చాగల్లులో వృద్ధాశ్రమానికి వెళ్లే రోడ్డులో నీరు నిలిచిపోయి బురదగా ఉన్న దృశ్యం

కుండపోత

- రోజంతా ఎడతెరిపి లేని వాన
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- ఇళ్లలోకి చేరిన వర్షం నీరు
- ఇబ్బందులు ఎదుర్కొన్న వాహనదారులు



గోపాలపురం: చిట్యాలలో చెరువును తలపిస్తున్న పొలాలు



కొవ్వూరు రెండో వార్డులో రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

కొవ్వూరు/తాళ్లపూడి, జూలై 18: అల్పపీడన ప్రభావంతో గురువారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. తెల్లవారు జామున ప్రారంభమైన చినుకులు మధ్యాహ్నానికి మరింత ఎక్కువై ఎడతెడపి లేకుండా సాయంత్రం వరకు కురుస్తూనే ఉంది. దీంతో ఎక్కడికక్కడ జనజీవనం స్తంభించింది. భారీ వర్షంతో రహదారులన్నీ జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లోకి నీరు చేరింది. మురుగుకాలువలు పొంగి రోడ్లపై ప్రవహించాయి. పంట పొలాల్లోకి వర్షపునీరు చేరడంతో పొలాలన్నీ చెరువులను తలపిస్తున్నాయి. వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. ఉదయం పూట కావడంతో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, కార్యాలయాలకు వెళ్లే సిబ్బంది వర్షంతో ఇక్కట్లను ఎదుర్కొన్నారు. కొవ్వూరు, నందమూరు, దొమ్మేరు, పశివేదల గ్రామాల్లో పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. పట్టణంలోని సత్యవతినగర్ నుంచి బస్టాండ్‌కు వచ్చే ప్రధాన రహదారి, ఎన్టీఆర్ క్రీడా ప్రాంగణం వద్ద, యానాది కాలనీ రోడ్లు, బస్టాండ్ నుంచి విజయవిహార్ సెంటర్‌కు వచ్చే ప్రధాన రహదారి జూనియర్ కళాశాల నుంచి మసీదువీధి వరకు రోడ్లపై వర్షపునీరు నిలిచిపోయింది. కొవ్వూరులో తహశీల్దార్ కార్యాలయం, ఫైర్‌స్టేషన్, పట్టణ, రూరల్ పోలీస్టేషన్, ట్రెజరీ కార్యాలయం, కోర్టు ప్రాంగణాల్లో వర్షపునీరు చేరి జలమయమయ్యాయి. పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా సత్వర చర్యలు చేపట్టాలని లోతట్టు ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు. భారీ వర్షంతో మండలంలోని పలు గ్రామాల్లో రహదారులు చిత్తడిగా మారాయి. రహదారి గుంతలలో వర్షపునీరు చేరడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

నల్లజర్ల: ఎడతెరిపి లేని వానతో పంట పొలాలతోపాటు గ్రామాలు నీట మునిగాయి. చీపురుగూడెంలో వరద నీరు వెళ్లేందుకు మార్గం లేక గ్రామంపై పడి పొంగి ప్రవహిస్తోంది. పుంతలో ముసలమ్మ గుడి వద్ద తూరలు పెట్టేందుకు గతంలో ఆర్అండ్‌బీ అధికారులు ప్రయత్నించగా వైసీపీ వర్గీయులు అడ్డుకున్నారు. దీంతో వరద నీరు సీసీ రోడ్డుపై పొంగి ప్రవహిస్తూ ఎస్సీ కాలనీపై పడుతోంది. అలాగే గూళ్లపూడి బాలకృష్ణ ఇంటి వద్ద ఉన్న డ్రైనేజీని కాంక్రీట్‌తో చిన్నదిగా చేయడంతో అటవీ మార్గంలో కురిసిన నీరు చెరువులోకి వెళ్లే మార్గం లేక విన్ ఆఫ్ ప్రేయర్ చర్చి వద్ద నుంచి గ్రామంపైకి పడుతోంది.

దేవరపల్లి: మండల కేంద్రమైన దేవరపల్లిలో మూడురోడ్ల సెంటర్, యాద వోలు వాగు వద్ద దళితపేటలో కాల్వలు పొంగి ఇళ్లలోకి, షాపుల్లోకి, స్టేట్ బ్యాం కులోకి, డిగ్రీ కాలేజీలో భారీగా వరదనీరు చేరింది. సంగాయిగూడెంలో కూడా లోతట్టు ప్రాంతం జలమయమైంది. మండలంలోని కొవ్వాడ కాల్వ పొంగి ప్రవహిస్తోంది. దేవరపల్లిలోని యాదవోలు వాగు పోలవరం వంతెన పైన వరదనీరు భారీగా ప్రవహించడంతో రాకపోకలకు ఇబ్బందులు కలిగాయి. దేవ రపల్లి మూడు రోడ్ల సెంటర్ వద్ద వర్షపు నీరు నిలిచిపోవడంతో ద్విచక్రవా హనాలు, బస్సులు, కార్లు వెళ్లడానికి ఇబ్బందులకు గురయ్యారు. గ్రామంలో డ్రైనేజీలు ఎక్కడికక్కడ అక్రమణకు గురవడంతో నీరు వెళ్లే దారిలేక ఊరిలో చాలా ఇళ్లు, షాపులు మునిగిపోయాయి. ప్లాస్టిక్ వ్యర్థాలు తూరలకు అడ్డుపడడంతో ఇబ్బంది కలిగింది. పంచాయతీ అధికారులు టీడీపీ, జనసేన నాయకులు ఆధ్వర్యంలో ప్రొక్లైనర్స్‌తో పూడికలు తొలగించి నీటి ప్రవాహం వెళ్లేలా చర్యలు చేపట్టారు. వరదనీరు ఇళ్లలో చేరడం, విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. ముంపు ప్రాంతాన్ని మాజీ మంత్రి తానేటి వనిత సందర్శించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి సువర్ణరాజు దళితపేటలోని వరదనీటి ప్రాంతాన్ని పరిశీలించారు. టీడీపీ నాయకులు గన్నమని హరికృష్ణ, సుంకర దుర్గారావు ముంపు ప్రాంతాన్ని సందర్శించి సమస్యల పరిష్కారానికి అధికారులను అప్రమత్తం చేశారు. ముంపు ప్రాంతాలను తహశీల్దార్ వై.ఆచారి పరిశీలించారు. పల్లపు ప్రాంతంలో ఉన్న పొలాలు ముంపుకు గురికావడంతో వరినాట్లు, కూరగాయ పంటలు దెబ్బతిన్నాయి. మండలంలోని గౌరీపట్నం, గొల్లగూడెం, త్యాజంపూడి, కురుకూరు, యర్నగూడెం, యాదవోలు, గ్రామాల్లోని 700 ఎకరాల్లో వరినాట్లు ముంపుకు గురయ్యాయని వ్యవసాయాధికారి కె.విజయ్ తెలిపారు.

నిడదవోలు: నిడదవోలులోని పోలీస్ స్టేషన్ నుంచి గాంధీబొమ్మ వరకు ఉన్న మెయిన్‌రోడ్డు, బస్టాండ్ నుంచి గాంధీనగర్ వైపు వెళ్లే రోడ్డు, ప్రభుత్వాసుపత్రి రోడ్డు, గణపతి సెంటరు నుంచి కోట సత్తెమ్మ దేవాలయానికి వెళ్లే యర్నగూడెం రోడ్డు పూర్తిగా జలమయమయ్యాయి. పట్టణ మండల గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలన్నీ చెరువులుగా మారిపోయాయి. డ్రైనేజీలన్నీ పొంగి పొర్లుతుండడంతో శానిటేషన్‌పై అధికార్లు ప్రత్యేక దృష్టి సారించాలని వ్యాధులు వ్యాపించకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గోపాలపురం: గోపాలపురంలో 5వ వార్డు వంగలవారి వీధి ఎగువ ప్రాంతం నుంచి ప్రవహిస్తున్న వరదనీటితో జలమయమైంది. అలాగే చిట్యాల, గోపాలపురం గ్రామాల మధ్య వరదనీరు రోడ్లపై ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే పలు గ్రామాల్లో తాటాకిళ్లు, రేకుషెడ్లు, పెంకుటిళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. కొవ్వాడ కాల్వ నీటి ప్రవాహంతో చిట్యాలలో 900 ఎకరాలు, చెరుకుమిల్లిలో 150 ఎకరాలు, వెంకటపాలెంలో 520 ఎకరాల్లో వరి పంట నీట మునిగినట్టు అధికారులు అంచనా వేశారు. చెరువులు పూర్తిగా నిండిపోయాయి. ఇదే పరిస్థితి కొనసాగితే చెరువులకు గండ్లు పడే ప్రమాదముందని ప్రజలు భయాందోళన చెందుతున్నారు.



నల్లజర్ల: పుల్లలపాడులో బోదెలోకి స్కూల్ బస్సు

ఉండ్రాజవరం: వర్షం ధాటికి రోడ్లు ఛిద్రంగా మారాయి. ఉండ్రాజవరం నుంచి దమ్మెన్ను వరకు ఆర్అండ్‌బీ రోడ్డుపై ఉన్న గోతుల్లో నీరు ఉండి ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురతున్నారు. ఉండ్రాజవరం స్టేట్ బ్యాంకు ఎదుట రోడ్డుపై గోతులు ఏర్పడి నీరు చేరడంతో ప్రజలు అవస్థలు పడ్డారు.

చాగల్లు: వర్షం నీటికి చాగల్లులో రోడ్లు, డ్రైన్లు పొంగి ప్రవహిస్తున్నాయి. మెయిన్‌రోడ్డు నుంచి వృద్ధాశ్రమానికి వెళ్లే రోడ్డు గోతులో ఉండి వర్షం నీరు నిలిచిపోయింది. నిర్మాణంలో ఉన్న ఈ రోడ్డు వాహనాల రాకపోకల వల్ల బురదగా మారింది. గురువారం 7.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్టు అధికారులు తెలిపారు.

బాధితులను ఆదుకుంటాం : మద్దిపాటి

దేవరపల్లి/నల్లజర్ల, జూలై 18: భారీ వర్షం వలన మండలంలో ముంపుకు గురైన పంట తాలూకు నష్టపరిహారం, లోతట్టు ప్రాంతాల్లో నీటమునిగి నష్టం వాటిల్లిన ఇళ్లకు ప్రభుత్వం నుంచి సహాయసహకారాలు అందిస్తామని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. దేవరపల్లిలో భారీ వర్షంతో కుప్పకూలిన ఇళ్లు, షాపులను గ్రామ ప్రధాన కూడలిని ఆయన పరిశీలించారు. వరద వచ్చినప్పుడల్లా దేవరపల్లిలో యాదవోలు వాగుకు దళితపేటలో భారీ వరద నీరు రావడం దానికి నీరు వెళ్ళే మార్గాలు లేకపోవడంతో తరచూ ముంపుకు గురవుతున్నాయని ఎమ్మెల్యే దృష్టికి ప్రజలు తీసుకొచ్చారు. శాశ్వత పరిష్కారానికి అధికారులతో సమీక్షించి పక్కా డ్రైన్లు నిర్మించడంతో పాటు ఆక్రమణలు తొలగించి ఎటువంటి వరదనీరుకు ఆటంకం లేకుండా చేస్తామన్నారు. దేవరపల్లిలో డ్రైనేజీలను ఎవరికి వారు ఆక్రమించుకోవడంతో ప్లాస్టిక్ వ్యర్థాలు వంతెన తూర్ల వద్ద పేరుకుపోవడం, వర్షం నీరు కిందకి పారకుండా ఇళ్లలోకి చేరుతుండడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. అన్ని విషయాలు కూలంకశంగా సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని మద్దిపాటి చెప్పారు. వరదనీరు వెళ్లేలా అధికారులు యుద్ధ ప్రతిపాదికన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే నల్లజర్ల మండలంలో ముంపునకు గురైన చీపురుగూడెం గ్రామాన్ని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు పరిశీలించారు. త్వరలో పుంతలో ముసలమ్మ గుడి వద్ద తూరలు ఏర్పాటు చేసి కింది చెరువులోకి వరద నీరు వెళ్లే విధంగా చర్యలు తీసుకుంటానని గ్రామస్థులకు హామీ ఇచ్చారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్యే వెంట దేవరపల్లిలో జనసేన ఇన్‌చార్జి సువర్ణరాజు, గన్నమని హరికృష్ణ, సుంకర దుర్గారావు, కంబాల సత్తిబాబు ఉండగా చీపురుగూడెంలో టీడీపీ మండలాధ్యక్షుడు తాతిన సత్యనారాయణ, చెల్లు పెద్దరమన్నా, కూసంపూడి బుజ్జి, చెల్లు సుబ్రహ్మణ్యం, చెల్లు వీరవెంకట్రావు, గుదె సుబ్బారావు, జవ్వాది పల్లపరాజు ఉన్నారు.

పంట బోదెలోకి దూసుకుపోయిన స్కూల్ బస్సు

నల్లజర్ల, జూలై 18: మండలంలోని పుల్లలపాడు రోడ్డులో తాడేపల్లిగూడెం నారాయణ స్కూల్ బస్సు పంట బోదెలోకి దూసుకుపోయింది. తాడేపల్లిగూడెం నుంచి పుల్లలపాడు పరిసర గ్రామాలకు చెందిన 10మంది విద్యార్థులను స్కూల్ నుంచి దించేందుకు తాడేపల్లిగూడెంలో బయలుదేరిన బస్సు పుల్లలపాడు బైపాస్ నుంచి గ్రామానికి వెళ్లే దారిలో రోడ్డుపైకి వరద నీరు చేరడంతో బస్సు అదుపుతప్పి పంట కాల్వలోకి వెళ్లింది. స్థానికులు అప్రమత్తమై విద్యార్థులకు సురక్షితంగా ఇంటికి చేర్చారు.

హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించండి

అదనపు జిల్లా జడ్జి శ్రీనివాసరావు



హెల్మెట్‌పై అవగాహన కల్పిస్తున్న న్యాయసేవాధికార సంస్థ సభ్యులు

కొవ్వూరు, జూలై 18: వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, సీటుబెల్టు ధరించాలని కొవ్వూరు 9వ అదనపు జిల్లా జడ్జి ఎన్.శ్రీనివాసరావు అన్నారు. మండల లీగల్‌సెల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్, అదనపు జిల్లా జడ్జి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురువారం వన్ కె వాక్ నిర్వహించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ హెల్మెట్ ధరించాలన్నారు. హెల్మెట్‌లేని ప్రయాణం ప్రమాదకరమన్నారు. రహదారి భద్రత నియమాలు పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను కొంతవరకు అరికట్టవచ్చునన్నారు. మద్యం తాగి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ, లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేయరాదన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు, పోలీసు, బ్యాంకు సిబ్బంది, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

వృక్షాన్ని నరికిన బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

మునిసిపల్ కమిషనర్‌కు కౌన్సిలర్ మురళీకృష్ణ ఫిర్యాదు

కొవ్వూరు, జూలై 18: భక్తుల మనోభావాలు దెబ్బతీసే విధంగా కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో దేవతా వృక్షాన్ని నరికివేసిన బాధ్యులపై శాఖాపరంగా చర్యలు తీసుకోవాలని బీజేపీ కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మున్సిపల్ కమిషనర్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదుచేశారు. మురళీకృష్ణ మాట్లాడుతూ గోష్పాదక్షేత్రంలో సుందరేశ్వరస్వామి ఆలయం వద్ద 150 సంవత్సరాల వయసున్న దేవతా వృక్షం (రావిచెట్టు) ఉందని, ఇటీవల కురిసిన వర్షాలకు దానిలో ఒక కొమ్మ విరిగిపడింది. దానిని తొలగించే క్రమంలో మున్సిపల్ సిబ్బంది పర్యవేక్షణ లేకపోవడంతో చెట్టును 70శాతం నరికివేశారు. సమాచారం తెలుసుకున్న పిల్లలమర్రి మురళీకృష్ణ, కొందరు భక్తులు అడ్డుకున్నారు. నరికిన కొమ్మలను తరలించడానికి వీల్లేదని భక్తులు చెప్పడంతో నరికేవారు వెళ్లిపోయారని పేర్కొన్నారు. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి ఈ చర్యలకు కారణమైన వారిపై శాఖా పరమైన చర్యలు, క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలి

టీడీపీ నియోజక వర్గ మహిళా అధ్యక్షురాలు రామతులసి



రాజంపాలెంలో మొక్కలు నాటుతున్న రామతులసి

గోపాలపురం, జూలై 18: భావి తరాలకు సహజ సిద్ధమైన ప్రకృతిని అందించాలంటే ప్రతిఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని టీడీపీ నియోజక వర్గ మహిళా అధ్యక్షురాలు కాకర్ల రామతులసి అన్నారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా ఏర్పాటుచేసిన కొబ్బరి మొక్కలను మండలంలోని రాజంపాలెంలో గురువారం టీడీపీ నాయకుడు నందమూరి సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రభుత్వ, పాఠశాలల్లో, అంగన్వాడీ స్కూల్స్, కాల్వ గట్లపై నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరు మొక్కలు నాటి వాటి సంరక్షణ వ్యక్తిగత బాధ్యతగా తీసుకోవాలన్నారు. కాలుష్య రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములవ్వాలన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కాకర్ల జగదీష్, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

పేదలకు అందుబాటులో నిత్యావసర వస్తువులు

- పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్
- పెరవలిలో తక్కువ ధరకు బియ్యం, కందిపప్పు అందజేత



పెరవలిలో మహిళకు కందిపప్పు అందజేస్తున్న మంత్రి దుర్గేష్

పెరవలి/ఉండ్రాజవరం, జూలై 18: పేదలకు నిత్యావసర వస్తువులు అందుబాటులోకి తీసుకొచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందదని పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. పెరవలి, ఉండ్రాజవరంలోని ఆర్య వైశ్య సేవా సంఘం భవనాల్లో ఏర్పాటు చేసిన స్టాళ్లలో బియ్యం, కందిపప్పు తక్కువ ధరకు అందజేసే కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశాల్లో మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ధరలు నియంత్రణే లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో నిత్యావస్తువుల ధరలు పెరిగి పేదలపై భారం పడిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణే లక్ష్యమన్నారు. రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సహకారంతో పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో పెరవలిలో ఏర్పాటు చేసిన కేంద్రంలో ఫైన్ రకం స్టీమ్ బియ్యం రూ.49, ముడి బియ్యం రూ.48, దేశవాళి కందిపప్పు రూ.160కు విక్రయిస్తున్నట్టు తెలిపారు. గత ప్రభుత్వం ఖజానా ఖాళీ చేసిందని, ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు పెంచిన పింఛన్‌లు ప్రస్తుత ప్రభుత్వం పంపిణీ చేసిందన్నారు. ఉచిత ఇసుక పాలసీని ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేస్తోందన్నారు. కార్యక్రమాల్లో పెరవలిలో తహశీల్దార్ సుధ, ఎంపీడీవో హిమ మహేశ్వరి, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈర్పిన సత్యనారాయణ, టీడీపీ నాయకులు రవివర్మ, అతికాల శ్రీను, సలాది కృష్ణమూర్తి, జనసేన అధ్యక్షుడు పిప్పర రవి పాల్గొన్నారు. ఉండ్రాజవరంలో తహశీల్దార్ కె.నవీన్‌కుమార్, టీడీపీ మండలాధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ, జనసేన అధ్యక్షుడు వీరమళ్ల బాలాజీ, గన్నమని వెంకటసుబ్రహ్మణ్యం, ఈర్పిన సత్యనారాయణ, కుదప చక్రపాణి, అధికారులు పాల్గొన్నారు.

సాయిబాబాను దర్శించుకున్న ఎమ్మెల్యే ముప్పిడి



ఊనగట్ల సాయి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

చాగల్లు, జూలై 18: మండలంలోని ఊనగట్లలో సాయిబాబా ఆలయాన్ని, శివాలయాన్ని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు దర్శించుకని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండిత పురోహితులు ఆయనతో ప్రత్యేక పూజలు చేయించి వేద ఆశీస్సులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలని, ప్రజలకు మేలు జరగాలని దేవుని కోరుకున్నానన్నారు. ఆయన వెంట టీడీపీ నాయకులు నాదెళ్ల శ్రీరామ్ చౌదరి, కరుటూరి సతీష్, నందిగం విష్ణు, బొల్లిన శివనాగేంద్ర, నల్లూరి సూరిబాబు చినబాబు ఉన్నారు.

ఆటంకాలను అధిగమిస్తేనే విజయం సాధ్యం

నల్లజర్ల, జూలై 18: విశ్వాస జీవితంలో విజయం సాధించాలంటే అనేక ఆటంకాలు వస్తుంటాయని, వాటిని అధిగమించాలని ఆవపాడు పాస్టర్ కోనాల యోహాన్ అన్నారు. సుభద్రపాలెం విన్ ప్రేయర్ హౌస్‌లో రెండు రోజుల నుంచి ఉపవాస ప్రార్థన సభలను పాస్టర్ మరపట్ల జోజి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పాస్టర్ యోహాన్ మాట్లాడుతూ విజయం సాధించాలంటే సాధన తప్పనిసరి అన్నారు. నేటి సమాజంలో శాంతి, సమాధానం ఉండాలంటే ఆధ్యాత్మిం వైపు పయనించాలన్నారు.

చెట్టును ఢీకొని లారీ డ్రైవర్ మృతి

కొవ్వూరు, జూలై 18: రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతిచెందినట్టు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.సుధాకర్ తెలిపారు. కొవ్వూరు మండలం ఐ.పంగిడి గ్రామానికి చెందిన కోమటి దుర్గారావు(53) లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 17న డ్యూటీకి వెళ్లాడు. మెటల్ లోడ్‌తో దేవరపల్లి వైపు వెళ్తుండగా దేచర్ల త్రివేని గ్లాస్ ఫ్యాక్టరీ సమీపంలో లారీ అదుపుతప్పి రోడ్డు కుడి పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో దుర్గారావుకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి కుమారుడు కోమటి రాజేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

ఎస్ఎఫ్ఐ ప్లీనరీని జయప్రదం చేయాలి

ఉండ్రాజవరం, జూలై 18: రాజమహేంద్రవరంలో ఈనెల 20, 21 తేదీలలో జరిగే ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ సమావేశాలను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షుడు వై.భాస్కర్ కోరారు. గురువారం ఉండ్రాజవరం జడ్పీ హైస్కూల్లో ప్లీనరీ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సమావేశాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకునే కార్పోరేట్, ప్రయివేటు విధానాలు మానుకోవాలని, లేనిపక్షంలో పెద్దఎత్తున ఉద్యమాన్ని చేస్తామన్నారు. అనంతరం మండల కమిటీ నూతన అధ్యక్షుడిగా ఎ.అశోక్, కార్యదర్శిగా ఎస్.కార్తీక్‌లతోపాటు 10మంది సభ్యులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు వి.వెంకటేష్, కె.జయశీల్, శశిధర్, కేశవ, నాగు, సుదర్శన్, బాలాజీ, నరేష్, కార్తీక్, కె.నాని పాల్గొన్నారు.

టీడీపీ వర్గీయులపై దాడి

బ్లేళ్లతో గాయపరిచిన వైసీపీ వర్గీయులు



దాడిలో గాయపడ్డ సురేష్, పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బత్తుల, బీవీఆర్ చౌదరి

సీతానగరం, జూలై 18: పాత కక్షలు, రాజకీయ కక్షల నేపథ్యంలో తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం బొబ్బిల్లంక గ్రామంలో టీడీపీ వర్గీయులపై వైసీపీ వర్గీయులు దాడికి పాల్పడ్డారు. బుధవారం రాత్రి సుమారు 11గంటల ప్రాంతంలో వైసీపీకి చెందిన జయబాబు అశోక్‌లు టీడీపీకి చెందిన కె.సురేష్, అవినాష్‌లపై దాడిచేసి గాయపర్చారు. బ్లేళ్లతో దాడిచేయడంతో సురేష్ తీవ్రంగా గాయపడగా అవినాష్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. బాధితులు భయంతో పారిపోయి మరుసటిరోజు ఉదయం చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేరారు. ఈ దాడికి రాజకీయ కక్షలే కారణమని స్థానికులు భావిస్తున్నారు. విషయం తెలుసుకున్న రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణచౌదరి ఆసుపత్రికి చేరుకుని బాధితులను పరామర్శించారు. మెరుగైన వైద్య సేవలందించాలని ఆసుపత్రి వర్గాలకు తెలిపారు.

వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి : ట్రాన్స్‌కో ఈఈ

కోరుకొండ, జూలై 18: ప్రస్తుతం జిల్లాలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని ఏపీఈపీడీసీఎల్ ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ ఓ ప్రకటనలో చెప్పారు. తడిచిన స్తంభాలు, తెగిపడి ఉన్న వైర్లు తాకవద్దని, దగ్గరలో ఉన్న కరెంటు ఆఫీస్, విద్యుత్ అధికారులకు, సిబ్బందికి తెలియజేయాలని కోరారు. అలాగే పాడుబడిన బిల్డింగ్‌లు, మిద్దె ఇళ్లల్లో పాతకాలపు స్విచ్ బోర్డులను, విద్యుత్ లైన్లపై తెగిపడిన కొమ్మలను నేరుగా తాకవద్దని చెప్పారు. వీలైనంతలో రబ్బరు చెప్పులు ధరించడం శ్రేయస్కరమన్నారు. వ్యక్తిగత భద్రత ముఖ్యమని పేర్కొన్నారు.

అటానమస్ కళాశాలలను బలోపేతం చేయాలి

ఆర్ట్స్ కళాశాలలో మూడు రోజుల వర్క్‌షాపు ప్రారంభం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్కే

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 18 : విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి స్వయం ప్రతిపత్తి కల్గిన విద్యాసంస్థలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్కే అన్నారు. రాష్ట్రంలోని స్వయంప్రతిపత్తి కళాశాల ప్రధానాచార్యులు, ఇతర ముఖ్య సిబ్బందికి మూడు రోజుల వర్క్‌షాపు రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో గురువార ప్రారంభించారు. జోన్ 1 ఆర్జేడీ నాగలింగారెడ్డి, జోన్ 2 ఆర్జేడీ శోభారాణి, జోన్ 3 ఆర్జేడీ కళావతి, జోన్ 4 ఆర్జేడీ బాబు తదితరులు మాట్లాడారు. నాయకత్వం, నిర్వహణ లక్షణాల్లో స్వయంప్రతిపత్తి కలిగిన కళాశాలలను సాధికార పరచడం, ప్రభుత్వ అటానమస్ కళాశాలలను అకడమిక్ ఎక్సలెన్స్ కేంద్రాలుగా అభివృద్ధి చేయడం లక్ష్యంగా కమిషనరేట్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్, ఆంధ్రప్రదేశ్ ఈ వర్క్‌షాపును నిర్వహిస్తుందన్నారు. ఈ వర్క్‌షాపును అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా 26 స్వయం ప్రతిపత్తి కళాశాలల నుంచి ప్రిన్సిపాల్స్, ఐక్యూఏసీ సమన్వయాధికారులు, అకడమిక్ సెల్ సమన్వయాధికారులు, పరీక్షల నియంత్రణాధికారులు హాజరయ్యారు. మూడు రోజుల వర్క్‌షాపులో భాగంగా ఇన్స్టిట్యూషనల్ డెవలప్‌మెంట్ ప్లాన్, రీసెర్చి పబ్లికేషన్స్ ప్రమోషన్, స్కీంల డెవలప్‌మెంట్ ఆఫ్ ఫండింగ్ రీసెర్చి, అకడమిక్ కౌన్సిల్, బోర్డు ఆఫ్ స్టడీస్‌ను బలోపేతం చేయడానికి ఉత్తమ పద్ధతులు, పాఠ్యాంశాల రూపకల్పన, నిరంతర అంతర్గత మదింపు, ఆవిష్కరణలు వంటివాటిపై అవగాహన కల్పిస్తారు. ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ కె.విజయబాబు, అనిల్‌కుమార్, కాలేజియేట్ ఎడ్యుకేషన్ ఏపీ రిసోర్సు పర్సన్లు, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

కూటమి నాయకులను కలిసిన చల్లా

కడియం, జూలై 18: రాజమహేంద్రవరం ఆర్యాపురం కోఆపరేటివ్ బ్యాంకు ఎన్నికల్లో కూటమి పక్షాన పోటీ చేస్తున్న చల్లా శంకరరావు గురువారం కడియం మండలంలో కూటమి నేతలను కలిశారు. తమ ప్యానల్ అభ్యర్థులను గెలిపించేలా సహాయ సహకారాలు అందించాలని కోరారు. కూటమి ప్యానల్ కరపత్రాన్ని అందచేశారు.

సినిమా గైడ్

కొవ్వూరు	
యువరాజ్‌మాల్ వై.స్క్రీన్1: కల్కి	
వై.స్క్రీన్2	: భారతీయుడు-2
దేవిశ్రీ(గాయత్రి): ప్రభుత్వ జూనియర్ కళాశాల	
అనన్య	: భారతీయుడు-2
నిడదవోలు	
వీ మ్యాక్స్	: ---
రాధాకృష్ణ	: కల్కి
శ్రీగణపతి	: భారతీయుడు-2
దేవరపల్లి	
శ్రీరామ్ సినీ మ్యాక్స్	: కల్కి
శ్రీరామ్ సినీ మ్యాక్స్	: కల్కి
నల్లజర్ల	
శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్ స్క్రీన్1	: భారతీయుడు-2
స్క్రీన్ 2	: కల్కి
శ్రీనివాస	: ---